http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

గురువారం 20 మార్చి 2025

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## తెలంగాణ బడ్జెట్

# రూ.3.4లక్షల కోట్లు

**రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు.**

**మూలధన వ్యయం రూ.36,504 కోట్లు.**

- తెలంగాణ అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి భట్టి
- గత పదేళ్లలో విధ్వంస పాలన సాగింది
- బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టించారు
- ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా.. పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది
- సొంత మీడియాలో అబద్ధపు వార్తలతో ప్రజలను మోసం చేస్తున్నారు
- విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చాం



హైదరాబాద్

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలంగాణ శాసనసభలో ప్రవేశపెట్టారు. మూడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు భట్టి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా.. పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాలల్లో రంగరించి జోడు గుర్రాల తరహాలో సుపరిపాలన రథాన్ని పరుగులు పెట్టించడంతో సఫలీకృతమయ్యామన్నారు. - మిగతా3లో



## భూమి మిమ్మల్ని మిస్ అయ్యింది

- ఇది సహనం, ధైర్యం, అపరిమిత మానవ స్ఫూర్తికి పరీక్ష
- వారి అచంచలమైన సంకల్పం లక్షలాది మందికి స్ఫూర్తినిస్తుంది
- అంతరిక్ష పరిశోధన అంటే మానవ సామర్థ్య సరిహద్దులను అధిగమించడం
- సునీతా విలియమ్స్ ఒక ట్రైల్‌బ్లేజర్(ఆవిష్కర్త)..
- తన కెరీర్ మొత్తంలో ఈ స్ఫూర్తిని ప్రదర్శించిన ఐకాన్.

## ప్రపంచ మీడియా హైదరాబాద్‌కు

# రావడం ఇష్టం లేదా?

అందాల పోటీ లకు ప్రభుత్వం నామినల్‌గా ఖర్చు పెడుతుంది

ఈ కార్ రేసింగ్ వేరు...అందాల పోటీలు వేరు

ప్రభుత్వం డబ్బులు ఎలా ఉపయోగించామనేదే ఇంపార్టెంట్

ప్రభుత్వం తరపున ఉత్తమమైన సహకారం అందిస్తామని హామీ



హైదరాబాద్

తెలంగాణలో అందాల పోటీలు నిర్వహిస్తే తప్పేంటని ప్రశ్నించారు మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ వంటి నగరంలో అందాలు పోటీలు నిర్వహించాలని భావిస్తుంటే, దానికి కేటీఆర్ కు వచ్చిన ఇబ్బందేంటన్నారు. అందాల పోటీలు నిర్వహించే సత్తా తెలంగాణకు లేదని కేటీఆర్ భావిస్తున్నాడా? అని ప్రశ్నించారు. 'ప్రపంచ మీడియా హైదరాబాద్ కు రావడం కేటీఆర్ కు ఇష్టం లేదా?, అందాల పోటీ లకు ప్రభుత్వం నామినల్‌గా ఖర్చు పెడుతుంది. : ఈ కార్ రేసింగ్ వేరు...అందాల పోటీలు వేరు. ప్రభుత్వం డబ్బులు ఎలా ఉపయోగించామనేదే ఇంపార్టెంట్. అమెరికాకు చెందిన మల్టీ నేషనల్ సంస్థ మెక్ డోనాల్డ్స్ తెలంగాణ - మిగతా3లో



## భీమ్-యూపీఐ లావాదేవీలకు ప్రోత్సాహకాలు

- యూపీఐ లావాదేవీలపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం!
- భారత్‌లో యూపీఐ లావాదేవీలు 210 లక్షల కోట్లకు చేరాయి.
- ప్రతి రెండు వేల రూపాయల లోపు లావాదేవీలకు 0.15శాతం ఇన్సెంటివ్ అందించనుంది
- దీంతో పాటు చిరు వ్యాపారుల్ని ప్రోత్సహించేందుకు రూ.1500 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ నిర్ణయం



## ఆ డేటా రాష్ట్రాల పరిధిలో ఉంటుంది

- పదవీ విరమణ వయసును మార్చే ప్రతిపాదనలు ఏమీ లేవు
- ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని మాత్రమే సూచిస్తుంది
- పదవీ విరమణ వయసును పెంచనున్నారని వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదు
- ఉద్యోగుల పదవీ విరమణ వయసు మార్పుపై లోక్‌సభలో కీలక ప్రకటన చేసిన కేంద్రమంత్రి..!

## రాహుల్‌గాంధీ ఆదేశాలతోనే

# ఎస్సీ వర్గీకరణ

- వర్గీకరణ.. మాదిగల న్యాయమైన హక్కు
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో వర్గీకరణ కోసం అధ్యయనం చేశాం
- ఎస్సీ వర్గీకరణ చేసినందుకు కాంగ్రెస్, రాహుల్ గాంధీలను మాదిగలు అభినందించాలి
- భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు రాకుండా.. వన్‌మెన్ కమిషన్ వేశాం
- సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశాలతోనే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వర్గీకరణ.. మాదిగల న్యాయమైన హక్కు అని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో వర్గీకరణ కోసం అధ్యయనం చేశామని అన్నారు. ఇవాళ(బుధవారం) ఎస్సీ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేసినందుకు కాంగ్రెస్, రాహుల్ గాంధీలను మాదిగలు అభినందించాలని చెప్పారు. భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు రాకుండా.. వన్‌మెన్ కమిషన్ వేశామని గుర్తుచేశారు. 199 పేజీలతో ఓ నివేదికను కమిషన్ ఇచ్చిందని అన్నారు. ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించారని తెలిపారు. వర్గీకరణ..ఎవరికీ వ్యతిరేకం కాదు.. మాదిగలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. జెడ్పీటీషన్ నుంచి సీఎం వరకు.. - మిగతా3లో



## ఎవరికి నచ్చినా నచ్చకపోయినా టారిఫ్‌ల విధింపు వాస్తవమే

- శక్తిమంతమైన దేశంగా మారే క్రమంలో వాణిజ్య సంబంధాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి
- నిజానికి గత దశాబ్దాన్ని గమనించినట్లయితే.. గొప్ప ఆయుధీకరణను చూశాం
- ఆర్థిక ప్రవాహం, ఇంధన సరఫరా, సాంకేతికత బదిలీ పెరగడం చూశాం
- ఇదే ప్రపంచంలో జరుగుతున్న వాస్తవం.
- దశాబ్దం క్రితంతో పోలిస్తే నేడు అంతర్జాతీయ సంబంధాల్లో నియంతృత్వ ధోరణి తగ్గిందనే భావిస్తున్నాం
- కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు

# ఊసరవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి

**నమ్మి ఓట్లేసిన పాపానికి 4 కోట్ల మందిని ముంచిన బడ్జెట్ ఇది**

**పదేండ్ల ప్రగతి రథచక్రానికి పంక్చర్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇది.**

**ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్‌లా ఉంది**

**నీ తెలివి తక్కువ తనం వల్ల, నెగిటివ్ పాలిటిక్స్ వల్ల ఆదాయం తగ్గిపోయింది.**

హైదరాబాద్

తొండ ముదిరితే ఊసరవెల్లి అయితదని పెద్దలు చెబుతుంటారు.. కానీ ఊరసవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి అయితడని ఈ బడ్జెట్ చూసిన తర్వాత అర్థమవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు వేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఒక్క మాటలో ఈ బడ్జెట్ గురించి చెప్పాలంటే.. ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్‌లా ఉంది. నీ తెలివి తక్కువ తనం వల్ల, నెగిటివ్ పాలిటిక్స్ వల్ల ఆదాయం తగ్గిపోయింది. మీడియా ముందు రంకెలు వేయడం కాదు.. అంకెలు ఎందుకు ఆగమాయ్యాయో చెప్పు. గత బడ్జెట్ సందర్భంగా చెప్పినట్లు మీ - మిగతా3లో



# భూమి మిమ్మల్ని మిస్ అయ్యింది

**న్యూఢిల్లీ:** తొమ్మిది నెలలు అంతరిక్షంలో గడిపిన నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్ బుచ్ విల్మోర్ బుధవారం తెల్లవారుజామున భూమికి తిరిగి వచ్చారు. అంతరిక్ష నౌకలో లోపం కారణంగా, వారు తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలోనే ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు అక్కడి నుంచి తిరిగివచ్చిన వీరికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లకు స్వాగతం పలుకుతూ 'భూమి ఇన్నాళ్లూ మిమ్మల్ని మిస్ అయ్యింది' అని పేర్కొన్నారు.

ప్రధాని మోదీ తాను సునీతా విలియమ్స్‌తో పాటు ఉన్న ఫొటోను షేర్ చేస్తూ ఇలా రాశారు 'స్వాగతం, #Crew9! భూమి మిమ్మల్ని మిస్ అయింది. ఇది సహనం, ధైర్యం, అపరిమిత మానవ స్ఫూర్తికి పరీక్ష. సునీతా విలియమ్స్, #Crew9 వ్యోమగాములు పట్టుదల అంటే ఏమిటో మనకు మరోసారి చూపించారు. వారి అచంచలమైన సంకల్పం లక్షలాది మందికి స్ఫూర్తినిస్తుంది. అంతరిక్ష పరిశోధన అంటే మానవ సామర్థ్య సరిహద్దులను అధిగమించడం. కలలు కనే ధైర్యం.. ఆ కలలను నిజం చేసే ధైర్యం కలిగి ఉండటం. సునీతా విలియమ్స్ ఒక ట్రైల్‌బ్లేజర్(ఆవిష్కర్త).. తన కెరీర్ మొత్తంలో ఈ స్ఫూర్తిని ప్రదర్శించిన ఐకాన్. ఆమె సురక్షితంగా తిరిగి రావడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన వారందరినీ చూసి చాలా గర్వపడుతున్నాను. ఖచ్చితత్వం, అభిరుచిని కలగలిస్తే.. సాంకేతికత పట్టుదలను కలబోస్తే ఏమి జరుగుతుందో ఆమె నిరూపించారు' అని ?ప్రధాని మోదీ పేర్కొన్నారు.

సునీతా విలియమ్స్ భారత సంతతికి చెందిన వ్యోమగామి.



ఆమెకు ఇది మూడవ అంతరిక్ష ప్రయాణం. సునీత ఇప్పటివరకు మొత్తం 608 రోజులు అంతరిక్షంలో గడిపారు. సునీత 1965, సెప్టెంబర్ 19న ఒహియోలోని యూక్లిడ్‌లో జన్మించారు. అతని తండ్రి దీపక్ పాండ్య గుజరాత్‌లోని మెహ్సానా జిల్లాలోని ఝులసన్‌కు చెందినవారు. అత్యధికంగా అంతరిక్షంలో నడిచిన మహిళగా విలియమ్స్ రికార్డు సృష్టించారు. సునీతా విలియమ్స్ 2007,2013లలో భారతదేశాన్ని సందర్శించారు. 2008లో సునీతకు పద్మభూషణ్ అవార్డు లభించింది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ సునీతా విలియమ్స్ కు ఒక లేఖ రాస్తూ, ఆమెను భారత పుత్రిక అని అభివర్ణించారు. ప్రధాని మోదీ సునీతను ఈ లేఖలో భారత్‌కు రావాలంటూ ఆహ్వానించారు.

# ఎవరికి నచ్చినా నచ్చకపోయినా టారిఫ్‌ల విధింపు వాస్తవమే

విదేశాలపై టారిఫ్‌లు, ఆంక్షల విధింపునకు సంబంధించి కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరికి నచ్చినా నచ్చకపోయినా ఆ నిర్ణయాలు నిజమేనని చెప్పారు. శక్తిమంతమైన దేశంగా మారే క్రమంలో వాణిజ్య సంబంధాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న రైసీనా డైలాగ్ -2025లో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివిధ దేశాలపై సుంకాలు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వాణిజ్య పరిమితులు, టారిఫ్‌లు, ఆంక్షలు వంటి వాటికి భారత విదేశాంగ విధానంలో చోటుందా..? అని కేంద్ర మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి బదులిస్తూ.. 'మీరు నమ్మినా నమ్మకపోయినా.. సుంకాలు, ఆంక్షలు అనేవి వాస్తవ అంశాలు. దేశాలు వాటిని అమలుచేస్తున్నాయి. నిజానికి గత దశాబ్దాన్ని గమనించినట్లయితే.. గొప్ప ఆయుధీకరణను చూశాం. ఆర్థిక ప్రవాహం, ఇంధన సరఫరా, సాంకేతికత బదిలీ పెరగడం చూశాం. ఇదే ప్రపంచంలో జరుగుతున్న వాస్తవం. ఓ దేశం సమగ్ర జాతీయశక్తిగా ఎదిగే పోరాటానికి వ్యాపార, వాణిజ్య సంబంధాలు ముఖ్యమైన సహకారాన్ని అందిస్తాయి. అందుకే వాణిజ్య, వ్యాపార సంబంధాల కోసం దేశాలు పోటీపడుతున్నాయి.' అన్నారు.

ఈ సందర్భంగా అంతర్జాతీయ సంబంధాలను జైశంకర్ ప్రస్తావించారు. దశాబ్దం క్రితంతో పోలిస్తే నేడు అంతర్జాతీయ



సంబంధాల్లో నియంతృత్వ ధోరణి తగ్గిందనే భావిస్తున్నానని అన్నారు. నేడు చాలా వరకు విభజన రేఖలు చెరిగిపోయాయని కేంద్రమంత్రి అభిప్రాయపడ్డారు. భారత్‌పై అమెరికా సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చిన నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్ అత్యధిక స్థాయిలో సుంకాలు విధిస్తోందని ట్రంప్ పదేపదే ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల ఆయన యూఎస్ కాంగ్రెస్‌లో మాట్లాడుతూ.. ఏప్రిల్ 2 నుంచి భారత్ సహా పలు దేశాలపై పరస్పర సుంకాలు అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. దీనిపై వెనక్కి తగ్గే అవకాశమే లేదని చెప్పారు.

# ఒసామాబిన్ లాడెన్ ప్రస్తావన చేసిన ఏక్‌నాథ్ షిండే

**ముంబై:** మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ సమాధి తొలిగించాల్సిందేనంటూ జరుగుతున్న వివాదం ముదురుతోంది. ఈ అంశంపై మహారాష్ట్ర శాసనమండలిలో అధికార, విపక్ష సభ్యుల మధ్య బుధవారంనాడు గందరగోళం చెలరేగింది. దీనిపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథా షిండే మండలిలో మాట్లాడారు. ఔరంగబేజ్‌ను కొందరు కొనియాడుతుండటంపై విసుర్లు విసిరారు. ఔరంగజేబును ఒసామాబిన్ లాడెన్‌తో పోల్చారు. తమ గడ్డపై ఒసామాబిన్ లాడెన్‌ను పూడ్చిపెట్టేందుకు అమెరికా నిరాకరించిందని, అతని మృతదేహాన్ని సముద్రంలో గుర్తుతెలియని ప్రాంతంలో డిస్పోజ్ చేసిందని చెప్పారు. తద్వారా లాడెన్‌ను ఎవరూ కీర్తించకుండా అడ్డుకట్ట వేసిందని అన్నారు. ఔరంగజేబు సమాధిని తొలగించాలని ఓ వైపు రైట్ వింగ్ సంస్థలు డిమాండ్ చేస్తుంటే ఆయనను కీర్తించడం ఏమిటని షిండే నిలదీశారు. "ఔరంగబేబు ఎవరు? మన రాష్ట్రంలో ఆయనన కీర్తించడానికి మనం ఎందుకు అనుమతించాలి? రాష్ట్ర చరిత్రలో ఆయన ఒక మాయని మచ్చ" అని ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మరాఠా రాజు ఛత్రపతి శంజీరాజేను ఇస్లాంలోకి మారాలని ఔరంగబేబు ఛాన్స్ ఇచ్చినా అందుకు శంభాజీ ఒప్పుకోలేదని, దీంతో ఆయనను చిత్రహింసపెట్టి మరీ చంపారని గుర్తుచేశారు. అమెరికా సైతం ఒసామా బిన్ లాడెన్‌ను ఎవరూ కీర్తించడానికి తావీయకుండా, సొంత గడ్డపై కాకుండా సముద్రం మధ్యలో అతని మృతదేహాన్ని పూడ్చేసిందని అన్నారు దేవేంద్ర ఫడ్నవిస్ పాలనను ఔరంగజేబు పాలనతో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్



సప్కల్ పోల్చడాన్ని కూడా షిండే తిప్పికొట్టారు. ఔరంగజేబు, ఫడ్నవిస్ ఒకటేనా అని నిలదీశారు. ఔరంగబేజు శత్రువుల పట్ల వ్యవహరించిన రీతిలో ఫడ్నవిస్ ఎప్పుడూ ఇతరుల పట్ల వ్యవహరించలేదని అన్నారు. ముఖ్యమంత్రి మీపట్ల అనుచితంగా ప్రవర్తించారా అని శివసేన (యూబీటీ) ఎమ్మెల్యే అనిల్ పరబ్ వైపు తిరిగి ప్రశ్నించారు.

**నాగపూర్‌లో హింస**

ఔరంగబేజ్ సమాధిని తొలిగించాలనే వీహెచ్‌పీ డిమాండ్ల మధ్య ఒక మతగ్రంథం తగులబెట్టారనే వదంతులు వ్యాప్తి చెందడంతో గత సోమవారం సాయంత్రం నాగపూర్ మహల్ ఏరియాలో హింసాకాండ చెలరేగింది. దుండగులు పలు వాహనాలు, ఆస్తులకు నిప్పుపెట్టారు. ఈ ఘటనలో 50 మందికి పైగా అనుమానితులను పోలీసులు అరెస్టు చేశారు. నాగపూర్ హింసాకాండ ముందస్తు కుట్ర జరిగిందా అనే దానిపై విచారణ జరుపుతున్నామని, ఈ ఘటనలో 34 మంది పోలీసులు కూడా గాయపడ్డారని ఏక్‌నాథ్ షిండే తెలిపారు.

# పోలీసులే దొంగను నిద్రలేపారు

**కర్ణాటక:** అర్ధరాత్రి వేళ ఇంటి చోరీకి వచ్చిన దొంగ ఆరవేసిన టవల్, పంచను చోరీ చేసి పక్కింటి మీద నిద్రించగా, మంగళవారం ఉదయం పోలీసులు అతనిని నిద్రలేపి ఠాణాకు తీసుకెళ్లారు. నవ్వు పుట్టించే ఈ తమాషా సంఘటన శివమొగ్గ నగరంలో జరిగింది. వివరాలు.. నగర శివార్లలోని సోమినకొప్ప టీచర్స్ కాలనీలో కుమార్ అనే వ్యక్తి ఇంటి పై అంతస్తులోకి ఓ యువ దొంగ చొరబడ్డాడు. అక్కడ ఉన్న బీరువాను తెరిచి చూడగా అందులో ఏమీ దొరకలేదు. టవల్, పంచ తదితర దుస్తులను తీసుకుని పక్కింటి మిద్దెపెన వాటిని పరచుకుని నిద్రించాడు. తెల్లవారగానే కుమార్ ఇంటి పైభాగంలో ఆరవేసిన దుస్తుల కోసం రాగా, గది తలుపులు, బీరువా తలుపులు తెరిచి ఉండటం గమనించి ఆశ్చర్యపోయాడు. పోలీసులకు సమాచారమిచ్చాడు, వెంటనే పోలీసులు వచ్చి చూడగా పక్కింటిపై నిద్రిస్తున్న దొంగ కనిపించాడు. వినోబానగర ఎస్ఐ సునీల్, సిబ్బంది ఆ దొంగను నిద్ర లేపి పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు.



## భీమ్-యూపీఐ లావాదేవీలకు ప్రోత్సాహకాలు



ఢిల్లీ: కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. భారత్‌లో యూపీఐ లావాదేవీలు 210 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో భాగంగా భీమ్-యూపీఐ లావాదేవీలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు ప్రకటించింది. ప్రతి రెండు వేల రూపాయల లోపు లావాదేవీలకు 0.15శాతం ఇన్సెంటివ్ అందించనుంది. దీంతో పాటు చిరు వ్యాపారుల్ని ప్రోత్సహించేందుకు రూ.1500 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా కేంద్ర కేబినెట్ నిర్ణయాలను కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. యూపీఐ లావాదేవీలు రూ. 210 లక్షల కోట్లకు చేరుకున్నాయి. రూ. 2 వేలు కంటే తక్కువ విలువ కలిగిన లావాదేవీలకు ఎలాంటి ఛార్జీ లేవు. అయితే ప్రస్తుత యూపీఐ విధానంలో కస్టమర్ బ్యాంక్, ఫిన్‌టెక్ సంస్థ, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్, యాప్ సంస్థ ద్వారా 4 అంచెల్లో లావాదేవీలు పెరుగుతున్నాయి. తద్వారా లావాదేవీల్లో చార్జీలను భరించాల్సి వస్తోంది. రూ.1,500 కోట్లు ఇన్సెంటివ్ రూపంలో చిన్న లావాదేవీలకు ఛార్జీలు విధించడంలేదు'అని తెలిపారు. దీంతో పాటు పలు కీలక నిర్ణయ తీసుకుంది. వాటిల్లో

అసోంలో బ్రౌన్‌ఫీల్డ్ అమ్మోనియా యూరియా ఫ్యాక్టరీకి ఆమోదం

రూ.10,601 కోట్లతో అమ్మోనియా కాంప్లెక్స్ ఏర్పాటు

రూ.2,790 కోట్లతో దేశంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి పచ్చజెండా

గోకుల్ మిషన్‌కు రూ.3,400 కోట్లు కేటాయింపు

రూ.4,500 కోట్లతో మహారాష్ట్రలో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఆమోదం

## ఆ డేటా రాష్ట్రాల పరిధిలో ఉంటుంది



ఉద్యోగుల పదవీ విరమణ వయసును మార్చే ప్రతిపాదనలు ఏమీ లేవని కేంద్ర మంత్రి జిత్రేందర్ సింగ్ బుధవారం వెల్లడించారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఉద్యోగుల పదవీ విరమణతో ఉత్పన్నమయ్యే ఖాళీలను భర్తీ చేసే విధానం ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసులో మార్పులు చేసే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు.. సంస్థలు పదవీ విరమణ వయసులో మార్పులు చేయాలని కోరారా? అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. జాతీయ మండలి (జాయింట్ కన్సల్టేటివ్ మెకానిజం) సిబ్బంది వైపు నుంచి ఎలాంటి అధికారిక ప్రతిపాదన రాలేదన్నారు. కేంద్రం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు వివరాలు, పదవీ విరమణ వయసు తేడాలకు కారణాలను వివరించాలని కోరగా.. ఈ విషయం రాష్ట్రాల పరిధిలో ఉంటుందని.. అలాంటి డేటా ఏదీ కేంద్రం ఉండదని ఆయన క్లారిటీ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. గత కొద్దిరోజుల కిందట కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచనుందని వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. ఈ వార్తలను కేంద్రం ఖండించింది. పదవీ విరమణ వయసును పెంచనున్నారని వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. ఖాళీగా ఉన్న పోస్టులను సమయానుకూలంగా భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వంలోని మంత్రిత్వ శాఖలు, ఆయా విభాగాలను ఆదేశిస్తున్నట్లు చెప్పింది.

## నాగపూర్ హింసాకాండ ప్రధాన సూత్రధారి అరెస్టు






**నాగపూర్:** మహారాష్ట్రలోని నాగపూర్‌లో మార్చి 17న రెండు గ్రూపుల మధ్య చెలరేగిన హింసాకాండ ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ హింసాకాండకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఫాహీమ్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. షాహీమ్ ఖన్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో నితిన్ గడ్కరిపై పోటీ చేశారు. ఇంతవరకూ పోలీసులు 50 మందిని అరెస్టు చేయగా, నాగపూర్‌లోని 10 పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా రెండవ రోజైన బుధవారంనాడు కూడా కర్ఫ్యూ కొనసాగిస్తున్నారు. కాగా, నాగపూర్‌లో ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, ఇన్వెస్టిగేషన్ కొనసాగుతోందని డీసీపీ రాహులవ్ మక్నికర్ తెలిపారు. 10 పోలీసు బృందాలు ఇంతవరకూ 50 మంది దుండగులను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ కేసులో 19 మంది నిందితులను జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు (జేఎంఎఫ్‌సీ) రిమాండ్‌కు పంపింది. నాగపూర్‌లో ఇటీవల జరిగిన హింసాకాండను రాష్ట్ర హోం మంత్రి యోగేష్ కదమ్ ఖండించారు. ఇది చాలా సీరియస్ అంశమని చెప్పారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, డీసీపీ స్థాయి అధికారులు, పోలీసు సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని చెప్పారు. గత మూడు నాలుగేళ్లుగా మహారాష్ట్రలో ఉంటున్న బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులపై చర్యలను తీవ్రతరం చేశామన్నారు. కాగా, ప్రజలు ప్రశాంతతను పాటించాలని కాంగ్రెస్ ఎంపీ వర్ష గైక్వాడ్ కోరారు. పరిస్థితిని సాధారణ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రయత్నం కృషి చేయాలని, వాళ్ల నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా ప్రభుత్వం కట్టడి చేయాలని కోరారు. నాగపూర్ హింసాకాండలో ప్రమేయం ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని నేషనల్ కాగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ-ఎస్‌సీపీ) నేత రోహిత్ పవార్ సూచించారు. హింసాకాండ ఇలా చెలరేగిందిమొఘల్ చక్రవర్తి ఔరంగబేబ్ సమాధి తొలగించాలనే డిమాండ్ నేపథ్యంలో ఒక మతానికి చెందిన పవిత్ర గ్రంథాన్ని తగులబెట్టారనే వదంతులు చెలరేగడంతో నాగపూర్‌లో పలు చోట్ల హింసాకాండ చెలరేగింది. హసన్‌పురి ఏరియాలో ఆందోళనకారులు రెచ్చిపోయారు. పలు వాహనాలను, ఆస్తులకు నిప్పుపెట్టారు. ర్యాపిడ్ కంట్రోల్ ఫోర్స్ రంగంలోకి దిగి పలువురిని అదుపులోనికి తీసుకుంది. ర్యాపిడ్ కంట్రోల్ ఫోర్స్‌లోని మహిళా పోలీసు అధికారిపై అల్లరిమూక అసభ్యంగా ప్రవర్తించినట్టు ఎఫ్ఐఆర్ సైతం నమోదైంది. ఈనెల17వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు మొదలైన హింసాకాండ రాత్రి 11.30 వరకూ కొనసాగింది.

# తెలంగాణ బడ్జెట్ రూ.3.4లక్షల కోట్లు

-మొదటిపేజీ తరువాయి

అంబేద్కర్ సూచనలను అనుసరిస్తూ ప్రజాపాలన చేస్తున్నామన్నారు. అధికారాన్ని హెూదాగా భావించకుండా ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో విధ్వంస పాలన సాగిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వంపై నిరాధార విమర్శలు చేస్తున్నారన్నారు. సొంత మీడియాలో అబద్ధపు వార్తలతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం తమ బాధ్యత అని చెప్పుకొచ్చారు. సమ్మిళిత అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్నామని మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.
వరి బోనస్ కింద రూ.1,206 కోట్లు చెల్లించామన్నారు. ధాన్యం కొనుగోళ్లకు రూ.12,511 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. త్వరలో 14,236 అంగన్వాడీ పోస్టుల భర్తీ చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని తెలిపారు. విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చామని. విద్యావ్యవస్థ బలోపేతానికి యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని తీసుకొస్తున్నామన్నారు. 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని.. కులమతాలతో సంబంధం లేకుండా ఇంటిగ్రేటెడ్ సూళ్లలో బోధన ఉంటుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఉండనున్నట్లు తెలిపారు. ప్రతి సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ పథకం అమలులోకి తీసుకొస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల కోసం రూ.11,600 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి భట్టి వెల్లడించారు.

పౌరసరఫరాల శాఖ- 5734 కోట్లు
విద్య - 23,108కోట్లు
పంచాయతీ %ూ%రూరల్ డెవలప్‌మెంట్ -31605 కోట్లు
రైతు భరోసా- 18,000 కోట్లు.
వ్యవసాయ రంగానికి -24,439 కోట్ల రూపాయలు
పశుసంవర్ధక శాఖకు -1,674 కోట్లు.
పౌరసరఫరాల శాఖకు -5,734 కోట్లు.
మహిళా, శిశు సంక్షేమం -2,862 కోట్లు
ఎస్సీ అభివృద్ధి -40,232 కోట్లు
ఎస్టీ అభివృద్ధి-17,169 కోట్లు
బీసీ అభివృద్ధి-11,405కోట్లు
చేనేత రంగానికి-371
మైనారిటీ-3,591కోట్లు
విద్యాశాఖకు-23,108 కోట్లు
కార్మిక ఉపాధి కల్పన-900 కోట్లు
పంచాయతీరాజ్ శాఖకు-31,605 కోట్లు
మహిళా శిశు సంక్షేమశాఖ-2,862 కోట్లు.
షెడ్యూల్ కులాలు-40,232 కోట్లు



షెడ్యూల్ తెగలు-17,169 కోట్లు.
వెనుకబడిన తరగతుల సంక్షేమానికి-11,405 కోట్లు.
ఐటీ శాఖకు-774 కోట్లు
విద్యుత్ శాఖకు-21,221 కోట్లు
మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖకు-17,677 కోట్లు
నీటి పారుదల శాఖకు-23,373 కోట్లు
రోడ్డు భవనాలు శాఖకు-5907 కోట్లు
పర్యాటక శాఖకు-775 కోట్లు
క్రీడా శాఖకు-465 కోట్లు.
అడవులు, పర్యావరణ శాఖకు-1023 కోట్లు
దేవాదాయ శాఖకు-190 కోట్లు
హెూంశాఖకు- 10,188 కోట్లు
మహాలక్ష్మి పథకానికి రూ.4305 కోట్లు
గృహజ్యోతి పథకానికి రూ.2080 కోట్లు.
సన్న బియ్యం బోనస్‌కు రూ.1800 కోట్లు.
రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి రూ.1143 కోట్లు.

భట్టి ప్రసంగం..
అంబేద్కర్ స్ఫూర్తితో ప్రజాపాలన కొనసాగిస్తున్నాం. దేశానికే తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం.
తెలంగాణ తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలే ముఖ్యం. మాపై కొంతమంది సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారం చేస్తున్నారు.
అబద్ధపు వార్తలతో ప్రజలు మోసం చేస్తున్నారు. అబద్దపు విమర్శలను తిప్పి కొడుతూ వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం మా బాధ్యత.
అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనే మూడు అంశాలు మా నినాదం.
తెలంగాణ రైజింగ్ 2050 అనే ప్రణాళికతో సీఎం పాలనను ముందుకు నడిపిస్తున్నారు.
నేడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిణామం 200 బిలియన్ డాలర్లు. రాబోయే ఐదేళ్లలో ఐదు రెట్లు అభివృద్ధి చేసి 1000 బిలియన్ డాలర్లు ఉండేలా కార్యాచరణ.
ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి రూ.11,600?కోట్లు.
58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్.
%ూ×% సిటీగా 200 ఎకరాల్లో ప్రత్యేక టెక్ హబ్.
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
సన్న వడ్లకు క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్..
40 లక్షల ఎకరాల్లో సన్న వడ్లసాగు విస్తరణ.
ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య 8,332కు పెంపు.
ఆయిల్ ఫామ్ సాగుకు టన్నుకు 2000 అదనపు సబ్సిడీ.
వడ్ల బోనస్ కింద రైతులకు 1,206 కోట్లు చెల్లింపు.
తెలంగాణలో నిరుద్యోగ రేటు 22.9 శాతం నుంచి 18.1 శాతానికి తగ్గింపు.
57,946 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ.. తెలంగాణ డిజిటల్ ఉపాధి కేంద్రం పునరుద్ధరణ.
రాజీవ్ యువ వికాస పథకానికి రూ.6000 కోట్లు.
బీఎఫ్ఎస్ఐ రంగంలో విద్యార్థులకు ప్రత్యేక కోర్సులు
ప్రతీ నియోజకవర్గంలో కనీసం ఒక యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు.
స్కూల్స్‌లో ఐఐటీ-జేఈఈ, నీట్ కోచింగ్‌తో పాటు ఉచిత వసతులు.
గురుకులాల కోసం డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంపు.
విద్యార్థులకు ఉచితంగా సాయంత్రం స్నాక్స్ పథకం.
కొత్తగా 1,835 వైద్య చికిత్సలు ఆరోగ్య శ్రీలో చేరిక.. 90 లక్షల పేద కుటుంబాలకు ఆరోగ్య శ్రీ లబ్ధి..
ఆరోగ్య శ్రీ ప్యాకేజీల ఖర్చు 20 శాతం పెంపు..
ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు వేగంగా వస్తున్న మార్పుల ప్రభావాన్ని తెలంగాణ సమర్ధవంతంగా ఎదుర్కొంటుంది.
తెలంగాణ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధుని సాధిస్తుంది.
24-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర ఉత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం 16,12,579 కోట్లు.
గత ఏడాదితో పోల్చితే వృద్ధి రేటు 10.1శాతంగా నమోదైంది.

# ఊసరవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి..

-మొదటిపేజీ తరువాయి

బడ్జెట్ అంచనాలకు ఎందుకు చేరుకోలేకపోయింది. నమ్మి ఓట్లేసిన పాపానికి 4 కోట్ల మందిని ముంచిన బడ్జెట్ ఇది. పదేండ్ల ప్రగతి రథచక్రానికి పంక్చర్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇది. రేవంత్ రెడ్డి అసమర్థతకు, చేతగానితనానికి నిలువుటద్దం ఈ బడ్జెట్. వీరి అసమర్థతత, చేతకాని తనం వల్ల ఆకాశం నుంచి పాతాళం వైపు ఆర్థిక వ్యవస్థ పోతున్నదంటే కచ్చితంగా బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకోవాలి. కేసీఆర్ ఏడాదికి రూ. 40 వేల కోట్ల అప్పు జేస్తే రంకెలు వేశారు. కానీ ఇవాళ ఒక్క ఏడాదికి లక్షా 60 వేల కోట్లు అప్పు చేసి కొత్త ప్రాజెక్టు కట్టలేదు. ఒక్క ఇటుక పేర్చలేదు. ఒక్క గ్యారెంటీ కూడా పూర్తిగా అమలుకు నోచుకోలేదు. ఈ బడ్జెట్‌ను చూస్తుంటే లక్షల కోట్ల అప్పు టార్గెట్ కనబడుతున్నట్టు ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.
తొండ ముదిరితే ఊరసవెల్లి అవుతదని పెద్దలు చెబుతారు. కానీ ఊరసవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి అయితడని ఈబడ్జెట్ చూసిన తర్వాత అర్ధమవుతుంది. సంక్షేమానికి సమాధి.. అభివృద్ధికి అడ్రస్ గల్లంతు.. ప్రజలకు ఇచ్చిన హామీలకు ఘోరీ కట్టి.. పార్టీ కార్యకర్తలకు మాత్రం వీళ్ల అబ్బ సొత్తు.. పప్పుబెల్లం లాగా 6 వేల కోట్లు పంచి పెడుతారట. కార్యకర్తలకు ఇస్తామంటే చూస్తూ ఊరుకోవడానికి ఈ రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరు. పప్పుబెల్లంలాగా పంచి పెడుతామంటే.. అది యువ వికాసం కాదు కాంగ్రెస్ వికాసం అయితది అని కేటీఆర్ మండిపడ్డారు.

**చంద్రబాబు మీద ప్రేమతో కిందకు నీళ్లు వదిలారు**

తెలంగాణ బడ్జెట్ వేళ.. బీఆర్ఎస్ పార్టీ అనూహ్య నిరసనకు దిగింది. ఎండిన వరికంకులతో ఆ పార్టీ సభ్యులు బుధవారం అసెంబ్లీకి వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ సర్కార్‌ను ఉద్దేశించి తీవ్రవ్యాఖ్యలు చేశారు. ఇది కాలం తెచ్చి కరువు కాదు. రేవంత్ తెచ్చిన కరువు. ముందుచూపు లేని దున్నపోతు ప్రభుత్వం ఇది. ప్రాజెక్టులలో నీరు ఉన్నా వదలడం లేదు. చంద్రబాబు మీద ప్రేమతో కిందకు నీరు వదిలారు. కేసీఆర్‌పై కోపంతో మేడిగడ్డను రిపేర్ చేయకుండా ఇసుక దోచేస్తున్నారు. 400 మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండబెట్టారు. కరువుతో ఓవైపు రైతులు అల్లలాడుతుంటే.. అందాల పోటీలు కావాల్సి వచ్చిందా? అని కేటీఆర్ అన్నారు. అని కేటీఆర్ మండిపడ్డారు.

**ఆరు గ్యారెంటీలు గోవిందా.. గోవిందా..**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ధ్వజమెత్తారు. ఇవాళ శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు. బడుగు, బలహీన వర్గాలను మోసం చేసేలా ఈ బడ్జెట్ ఉందని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో



పాటు ఆరు గ్యారెంటీల ఊసే లేదని కేటీఆర్ విరుచుకుపడ్డారు. శాసనసభ వాయిదా పడిన అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇవాళ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ రోజు రాష్ట్రంలోని పేదలు, రైతులు, ఆడబిడ్డలు అందరూ కూడా ఆశగా ఎదురు చూశారు. కానీ ఒక్క మాటలో చెప్పాలంటే భట్టి విక్రమార్క సుదీర్ఘ ఉపన్యాసం విన్న తర్వాత మాకు అర్థమైందంటే ఆరు గ్యారెంటీలు గోవిందా గోవిందా అని అర్థమైంది. ఆరు గ్యారెంటీలకు తిలోదకాలు వేశారు, పాతరేశారని స్పష్టంగా అర్థమైంది. ఇది కాంగ్రెస్‌కు రెండో బడ్జెట్. ఈ బడ్జెట్‌ను చూసిన తర్వాత మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ. 2500 నూరు రోజుల్లో ఇస్తామని ఓట్లు వేయించుకుని గెలిచి.. ఇప్పుడు మమ్మల్ని మోసం చేస్తున్నారని మహిళలు మండిపడుతున్నారు. మహిళలు నిరాశలో ఉన్నారు. 4 వేల పెన్షన్ ఇస్తామని చెప్పి పెద్ద మనషులు మోసం చేశారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లో 420 హామీలు గురించి కూడా ప్రస్తావించలేదు. ఆరు గ్యారెంటీలు, నూరు రోజులు అని సొల్లు పురాణం చెప్పి అఫిడవిట్లు రాసి.. ఇవి భగవద్గీతతో సమానం అని అబద్దాలతో ఓట్లు వేయించుకుని వాటికి ఇవాళ పాతరేశారు. ఒక్క హామీ కూడా అమలు కాలేదు. తులం బంగారం దిక్కు లేదు.. మహాలక్ష్మికి దిక్కు లేదు. పెన్షన్లకు పాతరేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో నేతన్నలకు పెద్దపీట వేస్తూ రూ. 1200 కోట్ల బడ్జెట్ పెడితే.. ఇవాళ రూ. 370 కోట్లకే పరిమితమైపోయింది. ఆటో డ్రైవర్లు 100 మందికి పైగా ఆత్హత్య చేసుకున్నారు. వారికి చెప్పిన ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు గురించి అతిగతి లేదు. వారి గురించి ఒక్క మాట లేదు. స్విగ్గీ, జొమాటో, ఇతర యాప్స్ ద్వారా ఫుడ్ డెలివరీ చేసే బాయ్స్‌కు గిగ్ వర్కర్స్ బోర్డు పెడుతామని చెప్పి మోసం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం చేసి 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. వారికి ఇంకా ఎక్కువ మేలు, న్యాయం చేస్తామన్నారు. వారి గురించి ఒక్క మాట కూడా బడ్జెట్‌లో చెప్పలేదు. పీఆర్సీ, డీఏల గురించి ప్రస్తావించలేదు. ఆడబిడ్డలకు తీరని తీవ్రమైన అన్యాయం జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. వర్గాల సోదరులకు ద్రోహం చేశారు. యాదవ సోదరులకు గొర్రెలు ఇస్తామని నమ్మబలికి వారి ప్రస్తావనే లేదు. ఆ పథకం ఊసే లేదు. అంబేద్కర్ అభయహస్తం కింద 12 లక్షలు ఇస్తామన్నారు.. కానీ దళితులకు వెన్నుపోటు పొడిచారు. కనీసం మాట కూడా ప్రస్తావించలేదు. దళిత, గిరిజన సోదరులను మోసం చేశారు. అధికారంలోకి రాగానే తొలి ఏడాది 2 లక్షల ఉద్యోగాలని రాహుల్ నరికిండు. ఇవాళ నిరుద్యోగుల గురించి ప్రస్తావన లేదు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో మందికి పుట్టిన బిడ్డలు మా బిడ్డలని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి రాష్ట్రంలోని నిరుద్యోగులు నవ్వుతున్నారు. కేసీఆర్ ఉద్యోగాలు ఇస్తే.. కాగితాలు ఇచ్చిన సన్నాసులు మీరు. 2 లక్షల ఉద్యోగాల గురించి డిమాండ్ చేస్తున్నా.. దరమ్ముంటే రా రాహుల్ గాంధీ.. అశోక్ నగర్‌కు రా.. చర్చ పెట్టి ఉద్యోగాల భర్తీ ఏమైందో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను. నిరుద్యోగ భృతి, యువ వికాసం అన్నారు. వీటి గురించి ఒక్క మాట లేదు. విద్యాభరోసా కార్డు గురించి ప్రస్తావన లేదు. ఉన్న గురుకులాలను నిర్వహించలేని అసమర్థులు వీరు.. 80 మందికి పైచిలుకు పిల్లలు చనిపోతే నివారించలేని వారు.. కొత్త స్కూల్స్ కడుతామని బిల్డప్స్ ఇస్తున్నారు.. సిగ్గు పడాలని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.

## రాహుల్‌గాంధీ ఆదేశాలతోనే ఎస్సీ వర్గీకరణ

-మొదటిపేజీ తరువాయి

మాదిగలు అభిమానించారు.. ఆదరించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గతంలో వర్గీకరణపై తాను అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తనను సభ నుంచి బయటకు పంపించారని గుర్తుచేశారు. వర్గీకరణపై సుప్రీంకోర్టులో బలంగా తమ ప్రభుత్వం వాదన వినిపించడంతోనే సాధ్యమైందని ఉద్ఘాటించారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తనకు మంచి మిత్రుడని..ఆయన అంటే తనకు ఎంతో అభిమానమని తెలిపారు. మంద కృష్ణకు తనపై కంటే కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలపై అభిమానం పెంచుకున్నారని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ వర్గీకరణ జరగలేదు.. మందకృష్ణ ఈ విషయం గుర్తించుకోవాలని అన్నారు. వర్గీకరణ తేల్చేవరకు కొత్త నోటిఫికేషన్ ఇవ్వలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మాదిగ బిడ్డను ఓయూకు, బాసర ఐఐటీకి వీసీలుగా తాము నియమించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఏది ఏమైనా సరే అనే తమ ప్రభుత్వం వర్గీకరణ చేసిందని చెప్పారు. అవకాశం వచ్చిన దానిని మీరు ఉపయోగించుకోండి. పది మందికి సహాయం చేసేలా పనిచేయాలని సూచించారు. అప్పుడే మరో పదిమందికి అవకాశాలు వస్తాయన్నారు. తాను సీఎంగా ఉన్నంత వరకు మీవాడే ఉన్నారనుకోవాలని చెప్పారు. తాను కేవలం పేరు మాత్రమే కోరుకుంటానని తెలిపారు. ఈ ప్రభుత్వం మీదే.. మీ సంక్షేమం, అభివృద్ధికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పిల్లలను బాగా చదివించండి.. ప్రభుత్వం అండగా ఉంటుందని మాటిచ్చారు. రాహుల్‌గాంధీ కోసం ఒక భారీ బహిరంగ సభ పెట్టాలని కోరారు. విజయోత్సవ సభ పెట్టండి..అభినందనలు చెప్పాలని అన్నారు. గాంధీ కుటుంబం మీ నుంచి కోరుకునేది అభినందనలు మాత్రమేనని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ప్రపంచ మీడియా హైదరాబాద్‌కు రావడం ఇష్టం లేదా?

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వంతో కీలక ఒప్పందం. సంస్థ విస్తరణలో భాగంగా మెక్ డొనాల్డ్స్ ఇండియా గ్లోబల్ ఆఫీస్ ను హైదరాబాద్ లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. 2,000 మంది ఉద్యోగులతో మెక్ డొనాల్డ్ గ్లోబల్ ఇండియా ఆఫీసును ప్రారంభించనుంది.
ప్రభుత్వం తరపున ఉత్తమమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు సీఎం రేవంత్. గత 15 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వివరించారు. సంస్థకు అవసరమైన శిక్షణ నైపుణ్యమైన ఉద్యోగులను నియమించుకునేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. యూనివర్సిటీని స్కిల్ జోన్ గా ఉపయోగించుకొని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి గ్లోబల్ ఆఫీస్ లోనే కాకుండా, దేశ విదేశాల్లో తమ ఆఫీసులు, అవుట్? లెట్లలో ఉద్యోగాలు కల్పించాలన్నారు. మెక్‌డొనాల్డ్స్‌కు అవసరమైన మొత్తం వ్యవసాయ ఉత్పత్తులను స్థానిక రైతులు సమకూర్చేలా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి కోరారు. దీంతో రైతుల ఆదాయం పెరుగుతుందని, రాష్ట్ర వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. బెంగళూరు లాంటి ఇతర సిటీలతో పోలిస్తే హైదరాబాద్‌లో ప్రతిభావంతులైన నిపుణులతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన జీవన ప్రమాణాలున్నాయని మెక్ డొనాల్డ్ సీఈవో క్రిస్ కెంప్జెన్స్కి అన్నారు. అందుకే హైదరాబాద్ ను తమ గ్లోబల్ ఇండియా ఆఫీస్ సెంటర్ గా ఎంచుకున్నట్లు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా మెక్ డొనాల్డ్స్ నిర్వహిస్తున్న కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. తదుపరి సంప్రదింపులు, ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలోనూ ఇటువంటి కార్యక్రమాలను చేపడుతామని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 38 మెక్‌డొనాల్డ్స్ అవుట్ లెట్లున్నాయి. ప్రతి ఏడాది మరో 3 లేదా 4 కొత్త అవుట్ లెట్లను విస్తరించే ప్రణాళికలున్నాయి. కొత్తగా గ్లోబల్ ఇండియా ఆఫీసు ఏర్పాటుతో రాష్ట్రంలోని యువతకు ప్రత్యక్షంగా పరోక్షంగా మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయి' అని పొన్నం తెలిపారు.

## హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిధుల గోల్ మాల్.. ఈడీ కీలక నిర్ణయం



**హైదరాబాద్ :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిధుల గోల్‌మాల్ కేసుల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ అసోసియేషన్ నిధుల గోల్‌మాల్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా హెచ్‌సీఏకి చెందిన రూ. 51 లక్షల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. హెచ్‌సీఏ నిధులతో ప్రైవేట్ ఆస్తులు కొనుగోలు చేసినట్లు తమ దర్యాప్తులో ఈడీ గుర్తించింది. అలాగే అనుమతులు లేకుండా పరికరాలను సైతం కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. అదే విధంగా క్రికెట్ బంతులు, జిమ్ పరికరాలతోపాటు బకెట్, కుర్చీల కొనుగోలులో సైతం నిధుల దుర్వినియోగం అయినట్లు ఈడీ గుర్తించింది. ఇక కాంట్రాక్టుల పేరుతో క్విడ్ ప్రో కో జరిగినట్లు ఈడీ అభియోగం నమోదు చేసింది. ఆ క్రమంలో హెచ్‌సిఏ మాజీ ట్రెజరర్ సురేందర్ అగర్వాల్‌పై ఈడీ అభియోగం నమోదు చేసింది. అందులోభాగంగా క్రికెట్ బాల్స్, బకెట్, చైర్స్, జిమ్ ఎక్విప్‌మెంట్ పేరుతో హెచ్‌సీఏ సబ్ కాంట్రాక్టులు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది.
అయితే ఆయా కాంట్రాక్టుల అప్పగించడంతో సురేందర్ అగర్వాల్‌కు క్విడ్ ప్రో కో కింద మూడు కంపెనీలు రూ. 90 లక్షల మేర నగదు చెల్లించినట్లు ఈడీ గుర్తించింది. ఇక సురేంద్ర అగర్వాల్‌తోపాటు అతని కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలలో రూ. 90 లక్షలకు పైగా నగదు ఉన్నట్లు ఈడీ ఉన్నతాధికారులు గుర్తించారు. అంటే హెచ్‌సీఏ మాజీ వైస్ ప్రెసిడెంట్ సురేందర్ అగర్వాల్ భార్య, కుమారుడు, కోడలు అకౌంట్లకు ఈ నగదు బదిలీ చేసినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించారు. అలాగే సురేందర్ అగర్వాల్ భార్యకు చెందిన కేబీ జ్యువెలర్స్ ఖాతాకు ఈ నగదు చెల్లించినట్లు రుజువైంది. దీంతో రూ. 90 లక్షలలో రూ. 51.29 లక్షల ఆస్తులను ఈడీ బుధవారం అటాచ్ చేసినట్లు అయింది.

## ఆహార నాణ్యతపై విరివిగా తనిఖీలు నిర్వహించాలి

**కరీంనగర్ :** జిల్లాలోని ప్రైవేటు ప్రభుత్వ హాస్టళ్లు హోటళ్లు ఆహారం తయారు చేసే కేంద్రాల్లో విరివిగా తనిఖీలు చేసి ఆహార నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఆహార నాణ్యత పై ఫుడ్ సేఫ్టీ జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఆహార కల్తీ, నాసిరకమైన ఆహారం తయారు చేయడం పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ విషయంలో అనుబంధ శాఖల సమన్వయంతో కొన్ని బృందాలను నియమించు కోవాలని, వాటి ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ముఖ్యంగా హోటళ్లు, ఐస్ పాయింట్లు, పండ్ల మార్కెట్లలో తనిఖీలు చేయాలని అన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలకి సరఫరా అవుతున్న ఆహార వస్తువులు, వంటకు వినియోగిస్తున్న సరుకులను పరిశీలించాలని సూచించారు. జిల్లాలో చిరు తిండి అమ్మకాలు సాగిస్తున్న చిన్న వ్యాపారుల వివరాలు సేకరించాలని, ఆహారం తయారు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి వారికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆహార సంబంధిత వ్యాపారం చేస్తున్న వ్యాపారం చేస్తున్నవారు నిబంధనలు పాటించక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహారం అమ్మకాలు సాగించే చోట పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం వినియోగదారులకు అందజేయాలని అన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ. ప్రభుత్వ ప్రైవేటు ఆధ్వర్యంలో నడుస్తున్న ఆహార తయారీ కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. హోటల్లు, హాస్టల్లో వంటగది, వాష్ ఏరియా శుభ్రంగా ఉంచాలని సూచించారు. వీధి అమ్మకం దారులకు ఫూర్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సునీత, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ సుజాత, డిడబ్ల్యూఓ సబిత, డిఎస్ఓ శ్రీనివాస్, డీఏవో భాగ్యలక్ష్మి, డిఇఓ జనార్ధన్ పాల్గొన్నారు.

# సంపాదకీయం


## ట్రంప్ శాంతి ప్రతిపాదనలు ఏకపక్షమేనా!

ట్రంప్ దృష్టి అంతా రష్యాతో చెడిపోయిన అమెరి కా సంబంధాలను పునరుద్ధరించుకోవడం పైననే ఉన్నట్లు స్పష్టం అవుతుంది. అందుకోసం రష్యాపై విధించిన ఆంక్షలను తొలగించేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు వెల్లడి అవుతుంది. చైనా నుండి ఎదురవుతున్న సవాళ్ళను ఎదుర్కొ నేందుకు రష్యా- చైనాల మధ్య కొంత దూరం సృష్టించాలని ఎత్తుగడగా కనిపిస్తున్నది. మూడున్నర దశాబ్దాలుగా 'ప్రచ్ఛన్న కాలం' నాటి సోవియట్ యూనియన్‌ను శత్రుదేశంగా పరిగణించే అమెరికా విదేశాంగ విధానంలో మార్పు తీసుకు వచ్చేందుకు ట్రంప్ ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పరిణామాలు సహజంగానే ఉక్రెయిన్‌కు అశనిపాతంగా మారే అవకాశం ఉంది. అమెరికా అధ్యక్ష పదవిని రెండోసారి చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ రెండు నెలల పదవీకాలంలోనే స్వదేశంలో, విదేశాలలో కలకలం సృష్టిస్తున్నారు. ఒకవంక, సంఘర్షణలను ఆపివేసి శాంతిదూతగా పేరు తెచ్చుకునేందుకు మధ్య ఆసియాలో తాను పదవి చేపట్టేలోగా కాల్పుల విరమణ జరగాలని స్పష్టం చేశారు. మరోవంక, ఉక్రెయిన్‌లో సైతం కాల్పుల విరమణకు ప్రతిపాదిస్తూ తాను తలచుకొంటే 24 గంటలలో సాధ్యం అవుతుందంటూ చెప్పుకొచ్చారు. సంఘర్షణలకు ఒకవైపు తాత్కాలిక విరామం లభించేటట్లు ప్రయత్నం చేస్తూ మరోవంక వాణిజ్యపరంగా టారిఫ్ యుద్ధాలకు ఆజ్యం పోస్తున్నారు. టారిఫ్‌లను తగ్గించని పక్షంలో ఎదుటివారెంతగా టారిఫ్‌లు విధిస్తారో తాము కూడా అంతే విధిస్తామంటూ చెబుతున్నారు. స్వదేశంలో సైతం ఉద్యోగులను తొలగించడం, పలు అసాధారణమైన ఉత్తర్వులపై సంతకాలు చేయడం చేస్తున్నారు. రెండు నెలలకే ఇంతగా హడావుడి చేస్తున్నారు, మరో నాలుగేళ్ల వరకు ఎంతగా చెలరేగిపోతారో అంటూ గుసగుసలు బయలుదేరుతున్నాయి. ఆయన చేపట్టిన చర్యలలో చాలావరకు సంచలనాలు కనిపించడమే గాని శాశ్వత పరిష్కారాలు కనిపించడం లేదు. ఆయనకు సైతం అటువంటి ఉద్దేశాలు ఉన్నట్టు లేదు. ఉదాహరణకు మధ్య ఆసియాలో కాల్పుల విరమణతో బందీల మార్పిడి వరకు విజయం సాధిస్తున్నారు. ఇది మొదటి దశ 45 రోజులకు మాత్రమే కావడం గమనార్హం. ఆ తర్వాత ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది. రెండో దశలో గాజా నుండి ఇజ్రాయెల్ సేనలు పూర్తిగా వైదొలగాలి. అటువంటి అవకాశాలు కనిపించడం లేదు. ఇజ్రాయెల్ సైతం తమ బందీలను విడిపించుకోవడం కోసమే కాల్పుల విరమణకు అంగీకరించినట్లు కనిపిస్తున్నది. మూడవ దశలో మొత్తం గాజాను పునర్నిర్మించి, అక్కడున్న పాలస్తీనా ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించి, ట్రంప్ టవర్లు నిర్మిస్తారని వస్తున్న ప్రతిపాదనలు ఎవ్వరికీ ఆమోదయోగ్యం అయ్యే అవకాశం లేదు.సుస్థిరమైన పాలస్తీనా దేశం ఏర్పాటుకు ఇజ్రాయెల్ అంగీకరిస్తుందని భావించలేం. అదే విధంగా చివరకు ఇజ్రాయెల్ ప్రయోజనాలను కాపాడటం మినహా అమెరికా సైతం స్వతంత్రించి నిర్ణయాలు ప్రకటించలేదు. అక్కడున్న సుమారు 23 లక్షల మంది పాలస్తీనా ప్రజలను తరలించి పునరావాసం కల్పించేందుకు అరబ్ దేశాలు ఏవి ముందుకు రావడం లేదు. ప్రస్తుత పరిస్థితులలో అది ఆచరణ యోగ్యమైన పరిష్కారం కూడా కాబోదు. దానితో సుడాన్, సోమాలియా వంటి తూర్పు ఆఫ్రికా దేశాలకు తరలించేందుకు చర్చలు జరుపుతున్నారు. హమాస్ పట్ల కఠినంగా మాట్లాడుతున్న ట్రంప్ వారిని తుదముట్టడించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నది. పాలస్తీనా ప్రజలను అక్కడి నుండి తరలించి, గాజా భూభాగాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకొని, యుద్ధం కారణంగా కకావికలమైన ప్రాంతాన్ని బాగుచేసి, రియల్ ఎస్టేట్ అభివృద్ధి చేయాలని అమెరికా ప్రతిపాదిస్తుంది. ఇదే మాత్రం కార్యరూపం దాలుస్తుందో చెప్పలేం.

ఇక ఉక్రెయిన్ విషయానికి వస్తే ఆ దేశాన్ని నట్టేట ముంచే, రష్యాతో చెలిమికి ట్రంప్ ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు చెబుతున్న శాంతి పరిష్కారం ప్రతిపాదనలు అటు రష్యా, ఇటు అమెరికాలకు ప్రయోజనం కలిగించడమే గాని, ఉక్రెయిన్‌కు ఎటువంటి భరోసా కల్పించే అవకాశం కనిపించడం లేదు. ఈ యుద్ధం ప్రారంభమైనదే ఉక్రెయిన్‌ను నాటోలో సభ్యదేశంగా చేర్చుకునేందుకు అమెరికా, ఐరోపా దేశాలు ప్రయత్నించడంతో. రష్యా మొదటి నుండి పెడుతున్న ప్రధానమైన షరతు నాటోలో చేరబోమని హామీ ఇవ్వాలని. తమ దేశ సరిహద్దుల్లోకి నాటో దళాలను అనుమతించడం రష్యా భద్రతకు ప్రమాదకరం కాగలదు. యుద్ధం ప్రారంభమైన రెండు వారాల్లోనే అటువంటి షరతుకు ఉక్రెయిన్ సుముఖత వ్యక్తం చేస్తూ రాజీకోసం సిద్ధపడుతున్న సమయంలో అమెరికా, ఐరోపా దేశాలు చేరి పడనీయలేదు. ఉక్రెయిన్ భద్రతకు తాము భరోసా అంటూ రెచ్చగొట్టాయి. ఇప్పుడు రాజీకోసం ఉక్రెయిన్ కొంత భూభాగం పోగొట్టుకొనేందుకు సైతం సిద్ధపడాలని ట్రంప్ చెబుతున్నారు. ఉక్రెయిన్‌లోని నాలుగు రాష్ట్రాలు, అంటే 20 శాతం భూభాగం ఇప్పుడు రష్యా అధీనంలో ఉన్నాయి. ఎటువంటి శాంతి ప్రతిపాదనలు సైతం ఆ భూభాగాల నుండి రష్యాను వెనుకకు పంపించే అవకాశాలు కనిపించడం లేదు. మరోవంక, ఉక్రెయిన్‌కు తాము చేసిన సైనిక సహాయానికి బదులుగా ఆ దేశంలోని అత్యంత విలువైన, అరుదైన లోహాలపై తమకు ఆధిపత్యం కల్పించాలని అమెరికా ఒత్తిడి తెస్తున్నది. అమెరికా 500 బిలియన్ డాలర్ల సైనిక సహాయం చేశామని చెబుతున్నది. వాస్తవానికి ఆ మొత్తంలో నేరుగా కేవలం 160 బిలియన్ డాలర్లు మాత్రమే ఉక్రెయిన్‌కు అమెరికా సహాయంగా ఇచ్చింది. మిగిలిన మొత్తాన్ని అమెరికాలోని ఆయుధ కంపెనీలకు అందజేసింది. ఆ విధంగా ఉక్రెయిన్ సహజ వనరులపై అమెరికా కన్నేసింది. మరోవంక, ఐరోపా దేశాల భద్రతకు తాను హామీ ఇవ్వలేనని ట్రంప్ చేతులెత్తేశారు. నాటో ఆర్టికల్ 5 ప్రకారం నాటోలోని ఏ సభ్య దేశంపై యుద్ధం జరిగినా అందులోని మొత్తం 32 సభ్య దేశాలు ఉమ్మడిగా సైనికంగా నిలబడాలి. కానీ ఇప్పుడు అమెరికా తోకాడించడంతో ఐరోపా దేశాలు ఆత్మరక్షణలో పడ్డాయి. దానితో అవి ఇప్పుడు ఉక్రెయిన్ కు సైనిక సహాయం అందించే పరిస్థితుల్లో లేవు. అందుకనే ఇప్పుడు ఫ్రాన్స్, జర్మనీ కలిసి 500 బిలియన్ డాలర్లతో ఉమ్మడి సైనిక వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించుకున్నాయి. అమెరికా ఇంకేమాత్రం తమకు సహాయకారి కాబోదని ఐరోపా గ్రహిస్తున్నది. ఈ పరిణామాలు అన్ని ఐరోపాలో మరింత అనిశ్చితకు అమెరికా ఆజ్యం పోస్తున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. ట్రంప్ ప్రపాదిస్తున్న నెల రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను సూత్రప్రాయంగా ఆమోదిస్తూ, షరతులు ప్రకటిస్తున్న రష్యా కేవలం ఉక్రెయిన్ స్వాధీనంలోని కీలకమైన కురుస్క్ ప్రాంతాన్ని తిరిగి తమ స్వాధీనంలోకి తెచ్చుకునేందుకు కాలయాపన చేస్తున్నది. ఒక గ్యాస్ పైప్‌లైన్ లోపల కిలోమీటర్లు నడిచి లోపలకు ప్రవేశించి ఉక్రెయిన్ సేనలను రష్యా దళాలు ముట్టడించాయి. ఉక్రెయిన్ ఆగస్టులో కురుస్క్ లోపలకు చొచ్చుకుపోయేందుకు సాహసోపేతంగా సీమాంతర దాడి ప్రారంభించింది. రెండవ ప్రపంచ యుద్ధం దరిమిలా రష్యన్ భూభాగంపైకి అది అతిపెద్ద దాడిగా భావిస్తున్నారు. కొన్ని రోజుల్లోనే ఉక్రెయిన్ దళాలు వ్యూహాత్మక సరిహద్దు పట్టణం సుద్జాతో సహా వేయి చదరపు కి.మీ భూభాగాన్ని కైవసం చేసుకుని, వందలాది మంది రష్యన్లను యుద్ధ ఖైదీలుగా తీసుకున్నాయి. భవిష్యత్తులో శాంతి చర్చల్లో బేరసారాల్లో లబ్ధి పొందడం, తూర్పు ఉక్రెయిన్‌లో దాడులనుంచి రష్యన్ సైనికులను మళ్లించేలా ఒత్తిడి చేయడం లక్ష్యంగా ఆ దాడి నిర్వహించినట్లు కీవ్ వెల్లడించింది. అయితే, ఉక్రెయిన్‌పై ఆకస్మాత్తుగా దాడి జరపడం ద్వారా ఈ ప్రాంతాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకోవడం ద్వారా రష్యా ఉక్రెయిన్‌కు దాదాపుగా కాల్పుల విరమణకు లొంగిపోవడం మినహా, ఎటువంటి బేరసారాలకు పాల్పడే అవకాశం లేకుండా చేస్తున్నది. కురుస్క్ ప్రాంతంలో ఉక్రేనియన్ సైనికులు 'తీవ్ర ఇబ్బందుల్లో' ఉన్నారని, రష్యన్ సైనికులు చుట్టుముట్టారని వెల్లడించిన ట్రంప్ తాను ప్రతిపాదిస్తున్న శాంతి ప్రతిపాదనలకు సంబంధించిన ఎటువంటి వివరాలు వెల్లడించడం లేదు. భూభాగాలు, విద్యుత్ ప్లాంటులు, కొన్ని ఆస్తుల విభజన గురించి ఉండవచ్చంటూ అస్పష్టంగా చెబుతున్నాయి. ముఖ్యంగా ఉక్రెయిన్‌కు కీలకమైన ఐరోపాలోని అతిపెద్ద అణువిద్యుత్ ప్లాంట్ అయిన ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమిత జపోరిజ్జియాకు తిరిగి ఇచ్చే ప్రతిపాదనలు సైతం కన్పించడం లేదు. శాశ్వత శాంతి ప్రతిపాదనగా రష్యా ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాలను తిరిగి ఇచ్చేసే ఎటువంటి ప్రతిపాదనకు రష్యా సుముఖంగా ఉన్నట్లు కనిపించడం లేదు. ఈ విషయంలో ట్రంప్ సైతం పట్టుదలతో ఉన్నట్లు లేదు. ఉక్రెయిన్‌కు సైనిక సహాయం నిలిపివేయడం, ఐరోపా దేశాలను సైతం ఉక్రెయిన్‌కు సైనిక సహాయం అందించలేని పరిస్థితులు కల్పించడం ద్వారా ఉక్రెయిన్‌ను నిస్సహాయ పరిస్థితుల్లో నెట్టివేసే ప్రయత్నాలే కనిపిస్తున్నాయి. ట్రంప్ దృష్టి అంతా రష్యాతో చెడిపోయిన అమెరికా సంబంధాలను పునరుద్ధరించుకోవడం పైననే ఉన్నట్లు స్పష్టం అవుతుంది. అందుకోసం రష్యాపై విధించిన ఆంక్షలను తొలగించేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు వెల్లడి అవుతుంది. చైనా నుండి

# పరీక్షలకే పరీక్ష

ఏడాది కాలంగా విద్యార్థి నేర్చుకున్న జ్ఞానానికి గంట, మూడు గంటల్లో పరీక్షించడం సబబా? ఇది నిజంగా విద్యార్థి ఏడాది కాలంగా నేర్చుకున్న అభ్యసనానుభవాలను అంచనా వేయగలుగుతుందా? విద్యార్థి పరిపూర్ణ మూర్తిమత్వంను ఈ పరీక్షలు ఎంత వరకు కొలమానం? ఏళ్ళుగా వస్తున్న మన పరీక్షా విధానం పైన పలు రకాల సందేహాలు మన విద్యారంగం మేధావులు, నిపుణులు వ్యక్తం చేస్తూ వచ్చారు. బ్రిటీష్ వలసవాదం నుండి వచ్చిన ఈ పరీక్షా విధానం మెకాలేకి నకలని, అశాస్త్రీయమైనదని, సమూలంగా ఈ విధానం మారాలని, విద్యార్థులను ఒత్తిడికి గురిచేయని పరీక్ష విధానం కావాలని కోరుకున్నాం. అందులో భాగంగానే మన పరీక్షా విధానం లోని లోపభూయిష్టతను సరిదిద్ది పరీక్షా సంస్కరణలను తెచ్చుకున్నాం! విద్యాహక్కు చట్టం -2009 కొంతలో కొంతైనా మన అనుమానాలు నివృత్తి పరచగలిగింది. సరికొత్త పరీక్షా సంస్కరణకు అవకాశం కల్పించింది. విద్యాహక్కు చట్టం- 2009, సెక్షన్ 29 (1) హెచ్ ప్రకారం విద్యార్థి ఏడాది కాలంగా పొందిన అభ్యసనానుభవాలు, జ్ఞానసామర్థ్యాలు, ఒత్తిడి లేకుండా పరీక్షించే పరీక్ష విధానం నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) మన నూతన ప్రక్రియ! ఈ పరీక్షా విధానం మౌలిక మార్పులు ఏమంటే నేర్చుకున్న దంతా గంట, మూడు గంటల్లో జవాబులు రూపంలో కక్కేసే కంటే! విద్యార్థి అభ్యసన అనుభవాలతోపాటు, విద్యార్థి విద్యా సామర్థ్య అంచనా పరికరం పరీక్ష కూడా నిరంతర సమగ్ర ప్రక్రియగా ఉండాలి. అది ఏ పాఠశాలలో, ఏ విషయంలో నేర్చుకుంటున్నామో! ఆ ఉపాధ్యాయులు, ఆ అధ్యాపకులే ఎప్పటికప్పుడు నిరంతరం విద్యార్థిని అంచనా వేసుకుంటూ విద్యార్థికి పరీక్షనుండి గమనించిన అంశాలు నిరంతరం సమీక్షించి, సరిచేయడానికి సాధనంగా ఉండాలి. ఆసాధనమే నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) విధానం అని విద్యాహక్కు చట్టం స్పష్టం చేసింది. దీని ప్రకారం నిర్మాణాత్మక మూల్యాంకనం (ఎఫ్ఎ), ఇది నాలుగు దశలుగా సబ్జెక్టును విభజించి, ఆ సబ్జెక్ట్‌లో రాత సామర్థ్యం, పఠనసామర్థ్యం, ప్రాజెక్టు వర్క్ (పని అనుభవం), స్లిప్ టెస్టు (జ్ఞాన అనుభవం) వీటన్నింటినీ తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో నిర్వహించబడి ఒక్కో అంశానికి 5 మార్కులు చొప్పున సగటున 20 మార్కుల ఏడాదిలో ఇవ్వబడతాయి.




ఈ నిర్మాణాత్మక పరీక్ష అనేది తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయుల వ్యక్తిగత బోధన సరిదిద్దడానికి, ఉపాధ్యాయులు తమ బోధనానుభవాలు సమీక్షకు, విద్యార్థి తాను వెనకబడిన విషయం తనకు తాను తెలుసుకోవడానికి తోడ్పడుతుంది. ఒక విధంగా ఇవి మనం ఎంతోకాలంగా కోరుకున్న మార్పులే! ఇకపోతే సిసిఇలో రెండవ అంశం ఏమంటే సబ్జెక్టు రెండు భాగాలుగా విభజించి ఒక్కో సెమిస్టర్‌కు 40 మార్కుల చొప్పున రెండు సెమిస్టర్‌లు కలిపి 80 మార్కులకు విద్యనేర్చిన పాఠశాలలోనే సంగ్రాహనాత్మక మూల్యాంకనం జరుగుతుంది.

ఈ సంగ్రాహ నాత్మక మూల్యాంకనంలో విద్యార్థి పొందిన జ్ఞానంతో పాటు, ఆయా సబ్జక్టులలోని ఆరు అభ్యసన సామర్థ్యాలు పరీక్షించబడతాయి. అంటే విద్యార్థి ఆ వయసులో పొందాల్సిన విద్యా సామర్థ్యాలు ఎంతో కొంత నిజాయితీగా అంచనా వేయగలిగిన విధానం. ఈ మొత్తం విద్యార్థి పొందిన 100 మార్కుల నుండి 3 నుండి 10 వరకు గ్రేడులను ఆయా విద్యార్థులకు పొందిన మార్కులను బట్టి ఇస్తారు. ఈ గ్రేడులే విద్యార్థి సమగ్ర మూల్యాంకనం అంచనాగా భావించి బోధనా లక్ష్యాలు విద్యార్థికి అందేలా ముఖ్యంగా సబ్జక్టు ఉపయోగపడే అంశంపైనే ఈ పరీక్షలు! విద్యార్థి, ఉపాధ్యాయులు చేతిలో నిరంతర సమగ్ర సాధనం అయిన ఈ నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానం వచ్చి15 ఏళ్ళుగడిచినా నేటికీ దాన్ని సంపూర్ణంగా అమలు జరిపే ధైర్యం పాలక వర్గాలకు లేదు. ఇటు అర్థం చేసుకొని అనుసరించే స్థితికొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులలో లోపించింది. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు విద్యా వ్యవస్థ ఒత్తిడి తట్టుకోలేక, మానెటరింగ్ వ్యవస్థ సరిదిద్దుకోలేక, ఇప్పటికే సంగ్రహనాత్మక మూల్యాంకనం వార్షిక పరీక్షగా, పాత వాసనలతో నిర్వహిస్తున్న 80 మార్కులకు గాను, నిర్మాణాత్మక మూల్యాంకనం 20 మార్కులు కలిపి పాత పద్ధతిలో 100మార్కులకు ఎస్ఎస్‌సి పరీక్ష నిర్వహించపూనుకుంది. ఇది ఈ ఏడే అమలు పరచాలని అధికారులు ప్రయత్నించారు కూడా? కానీ, కొన్ని సాంకేతిక సమస్యల వలన మరుసటి ఏడాదికి వాయిదా వేసుకున్నారు. అంతేకాకుండా మరో పరీక్ష మార్పుకు సైతం ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మార్చిలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సరైన గ్రేడ్ రాని పక్షంలో మే నెలలోపు మరో ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించి ఒకేసారి ఫలితాలు ప్రకటిస్తామని ప్రకటించారు. అంటే పాత సప్లిమెంటరీ పరీక్షలు తిరిగి పునరుద్ధరణ అన్న మాట! అంటే ప్రైవేటు విద్యా వ్యవస్థ కోరికలు తూచా తప్పకుండా అమలు జరపడానికి అధికారులు, పాలకులు సంసిద్ధం అయ్యారనే విషయం సుస్పష్టం అవుతుంది. అభ్యసనానుభవాలు, పాఠ్యాంశాలు అధ్యయనంలో అంతర్లీనంగా, అంతర్భాగంగా జరగాల్సిన నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) ప్రక్రియ మన పరీక్ష విధానంలో ఒత్తిడి లేని సులభతరం అయిన విధానాలకు సూచికనై ఉండగా, దాన్ని బలోపేతం చేయకపోగా ఎటు తిరిగీ మన పాత మూల్యాంకనం విధానం వైపు మన విద్యాధికారుల ఆలోచనలు కొనసాగడంలో అంతర్యం ఏమిటో ఒకపట్టాన అర్థం కాదు? మనం చట్టంగా తెచ్చుకున్న సులభం, సరళతరం అయిన పరీక్ష సంస్కరణ ఒత్తిడి లేని నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియకు బదులు దొడ్డిదారిన తెస్తున్న పాత మూల్యాంకనం విధానం ఏ రూపంలో తెచ్చినా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. మనం దీర్ఘకాలిక పోరాటంతో విద్యాహక్కు చట్టంగా తెచ్చుకున్న నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ సంపూర్ణంగా అమలు చేయాలనే డిమాండ్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు ముందుకు పోవాల్సి ఉంది. ఒత్తిడి, విద్యార్థుల ఆత్మహత్యలు లేని సంపూర్ణ పరీక్షా సంస్కరణ అమలు దిశగా అడుగులు వేద్దాం. మన పాఠశాల పరీక్షా వ్యవస్థలో సరైన మార్పులను మాత్రమే స్వాగతిద్దాం.

# ఆనందమే ఆరోగ్యం ఆరోగ్యమే మహాభాగ్యం

ఆనందం వెలకట్టలేని మానవ మానసిక సంపద. ఆనందంగా జీవించడం ఓ అద్భుత కళ. మన అస్థిత్వానికి పునాది సంతోషమే. ఆనందం అంగట్లో దొరికే అగ్గువ సరుకు కాదు. ముఖంలో నవ్వులు నర్తిస్తే అసలైన ఆనందంగా ఉన్నట్లు కాదు, నవ్వని వారు విషాదంలో మునిగినట్లు కాదు. మానసిక సంతోషానికి, ముఖంలో కనిపించే నవ్వులకు సంబంధం లేదు. మానస్ఫూర్తిగా సంతోషించే వారి ముఖాల్లో కోటి దివ్వెల వెలుగులు జనిస్తాయి. అంతరంగ ఆనంద ఊట బాయిలో ఉబికే ఊటయే సంతోషాల మూట. మన అనుమతి లేకుండా మన నుంచి ఎవ్వరూ ఆనందాన్ని దూరం చేయలేరు. ఆనందం అమూల్య ఆరోగ్యకర మానసిక ఆస్తి. ఆనందాల వేటలో కష్టసుఖాలను అనుభవిస్తూ సాగిపోతున్నాం, కొంత వరకు సఫలం అవుతున్నాం, అధిక శాతం వైఫల్యాలతో సంతోషాలకు దూరం అవుతున్నాం. ఆనందానికి సుఖానికి వ్యత్యాసం మరిచి పోతున్నాం. ఆనందానికి కొలమానం లేదు ఆనందాన్ని చూడడానికి, వర్ణించడానికి వీలు కాదు. సంతోషాన్ని అనుభవించడమే మనకు తెలుసు, వర్ణించడానికి వాక్యాలు దొరకవు. పడుకోగానే మనసారా నిద్రలోకి జారుకునే వారు అదృష్టవంతులు, అసలైన భాగ్యవంతులు. మన జీవనశైలి, ఆర్థిక స్థితిగతులు, ఆలోచనా విధానం, వ్యక్తిగత అలవాట్లు, విద్య వివేకాలు, సంతృప్త ఆధ్యాత్మిక భావనలు, మానవీయ దృక్కోణం, సర్దుకుపోయే గుణం, ఆశావహ దృక్పథం, కుటుంబ నేపథ్యం, సహచర బంధుమిత్రులు, కార్యాలయ లేదా పని ప్రదేశ్ ప్రభావాలు, సామాజిక స్థితిగతులు, సాంస్కృతిక ఆచార వ్యవహారాలు, మానవ సంబంధాలు, భావోద్వేగ నియంత్రణలు, చిన్న చిన్న విషయాల్లో గొప్ప గొప్ప సంతోషాలను వెతుక్కోవడం, ఆహార అలవాట్లు, ఆశ-దురాశలు, ఈర్ష్య అసూయ లాంటి అనేక అంశాలు మన ఆనంద క్షణాలను ప్రభావితం చేస్తాయి. ఒక చిన్న సమస్య మన ఆనందాన్ని లాక్కోవచ్చు. ఒక చిన్న సమస్యను తలుస్తూ వందల సార్లు వగచి, తలచి కుమిలిపోయే వారికి ఆనందం అందని ద్రాక్ష అవుతుంది. మనం చేసే ప్రతి పనికి అంతిమ లక్ష్యం ఆనందం వెతుక్కోవడమే. మానవ




ఆరాటపోరాటాల గమ్య స్థానం ఆనంద నిధిని పొందడం మాత్రమే. ఆనందానికి, శ్రేయస్సుకు విడదీయరాని బంధం ఉంటుంది. నేటి వేగవంతమైన ఆధునిక డిజిటల్ ఏఐ యుగపు మానవుడికి ఆనందం అందని వస్తువే అవుతున్నది. ఆనందమయ జీవితం గడిపే వారికి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఆనందమే ఆరోగ్యమని, ఆరోగ్యమే మహాభాగ్య మని తెలుసుకుందాం. సిరి సంపదలు, కీర్తి, పరువు ప్రతిష్టలు ఆనందాన్ని ఇవ్వకపోవచ్చు. డబ్బుతో విలాసవంతంగా బతకవచ్చు, కాని ఆనందంగా జీవిస్తామనే గ్యారంటీ లేదు. సంపద పెరిగితే సమస్యలు కూడా పెరుగుతూ మన ఆనంద క్షణాలు హరించుకుపోతాయి. శారీరక సౌకర్యమే సుఖం, మానసిక ఉత్తమ స్థితి సంతోషం అని తెలుసుకోవాలి. ఆనందంగా జీవించడం అనే అద్భుత కళను ప్రచారం చేయడానికి 2012లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రపంచ దేశాలు ప్రతి ఏట 20 మార్చిన "అంతర్జాతీయ ఆనంద దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ డే ఆఫ్ హాపీనెస్"ను 2013 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది. 2025 అంతర్జాతీయ ఆనంద దినోత్సవం ఇతివృత్తం "షేరింగ్ అండ్ కేరింగ్" అని తెలుసుకొని, దానిని మన జీవన మంత్రంగా చేసుకొని సంతోషంగా జీవితాలను సుసంపన్నం చేసుకుందాం. మనం ఇష్టపడే పనిలో సంతోషం దాగి ఉంటుంది. మన పనిని ఇష్టపడడం వల్ల ఆనంద నిధికి చేరువవుతాం. సంతోషంగా జీవించగలగడం ఓ అదృష్టం. బతుకడానికి, జీవించడానికి వ్యత్యాసం ఆనందమే. ఆనందంగా లేని వారు బతుకుతారు, సంతోషంగా జీవనయానం చేసే వారు జీవిస్తారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి అంశం నుంచి మనం ఆనందాన్ని వెతుక్కోవడం నేర్చుకోవాలి. ఆనందం ఎవరు ఇచ్చే వస్తువు కాదని, మనం ఆస్వాదించే జీవన విధానమే మనకు సంతోషాలను ఇస్తుంది. ఆనందంగా ఉండడం, సంతోషాలను పంచడం మన జీవిత లక్ష్యం కావాలి. మరొకరి సంతోషానికి మనం కారణం అయినపుడు మనకు అద్భుత ఆనంద నిధి దొరుకుతుంది. "బి హ్యాపీ - మేక్ అదర్స్ హ్యాపీ" అనే సూత్రాన్ని అమలు చేస్తే మన వెంట ఆనంద సుగంధాలు వస్తాయి.

# నిరుద్యోగ యువతీ, యువకులతో జాబ్ మేళా పై అవగాహన సదస్సు

## టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** మాడుగుల పట్టణ కేంద్రంలోనీ ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాడుగుల మండల నిరుద్యోగ యువతీ,యువకులతో జాబ్ మేళాకి సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందిఈ సంధర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ,నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ,యువకులను దృష్టిలో ఉంచుకొని ఈనెల 25 వ తారీఖుకల్వకుర్తి పట్టణ కేంద్రంలో సి కె ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నసుంకిరెడ్డి మెగా జాబ్ మేళనిప్రతి ఒక్క నిరుద్యోగి సద్వినియోగం చేసుకోవాలని,50 కి పైగా కంపెనీలతో ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళ ద్వారా 5,000 మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల అందించడమే లక్ష్యంగా జాబ్ మేళ నిర్వహిస్తున్నామని,జాబ్ మేళా యొక్క వివరాలను ప్రతి నిరుద్యోగికి తెలియపరచి,వారిని చైతన్య పరిచి ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందనీ,ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,ఉద్యోగ అవకాశాలు పొంది ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఈ సంధర్భంగా తెలియజేశారుఈ కార్యక్రమంలో,స్థానిక యువజన కాంగ్రెస్ తో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

## తలకొండపల్లి మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండల కేంద్రంలో అసెంబ్లీలో బీసీలకు 42% రిజర్వేషన్ ఆమోదించినందుకు , మరియు ఎస్సీ వర్గీకరణకు అ అసెంబ్లీ లో ఆమోదించిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి చిత్రపటానికి, స్థానిక శాసనసభ్యులు కసి రెడ్డి నారాయణ రెడ్డి , సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి ఆద్వర్యంలో,పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి డిగ్రీ కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, సీనియర్ నాయకులు డేవిడ్ రేణు రెడ్డి, చిత్తరంజన్, బోళ్ల యాదగిరి ముదిరాజ్, పాండు, రమేష్, ఇటమోని మల్లేష్ యాదవ్, రాజేందర్ నాయక్, నరసింహారెడ్డి, ఆంజనేయులు, సురేష్, శేఖర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి బాలింత మృతి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శ్యామల (26) నిండు గర్భంతో డెలివరీ కోసం ఆసుపత్రిలో అడ్మిట్ అయింది. మంగళవారం రాత్రి ఆపరేషన్ సక్సెస్ అయింది ఆడపిల్ల పుట్టింది తల్లి, బిడ్డ క్షేమంగానే ఉన్నారని కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. అర్థగంట గడవకముందే శ్యామలకు తీవ్ర రక్త స్రావం కావడంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సూచించగా శ్యామలను అంబులెన్స్ లో తరలిస్తుండగా మార్గ మధ్యంలో శ్యామల మృతి చెందింది. శ్యామల కారణం వైద్యం వికటించడం వల్ల శ్యామల మృతిచెందని కుటుంబ సభ్యులు ఆస్పత్రి ముందు ఆందోళన వ్యక్తం చేశారు శ్యామల మృతదేహానికి మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ నివాళులర్పించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తో మాట్లాడి బాలిక కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేటట్లు చూస్తానని అన్నారు. మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ మాట్లాడుతూ కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ఆసుపత్రులు పెట్టి, విధులకు రాకపోవడం వైద్యులు నిర్లక్ష్యంగా ఎంతోమంది నిరుపేదల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటా

## సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) ని:** ఆపదలో ఉన్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ అన్నారువెల్దండ, మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త,బాదేపల్లి అరుణ్ ముదిరాజ్, తండ్రి బాదేపల్లి నిరంజన్ అనారోగ్యంతో బాధపడుతున్నా విషయం తెలుసుకున్న సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి పరమార్శించి బాధితుడు బాధపెల్లి నిరంజన్ కు 10,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు అదేవిధంగా గ్రామానికి చెందిన మారేపల్లి అలివేల అనారోగ్యంతో ఉండడంతో వైద్య ఖర్చులకు గాను 5,000 రూపాయలను అందజేశారు సందర్భంగా సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పేద ప్రజలకు అన్ని విధాలకు అండగా ఉంటానని బాధితులు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి రెడ్డి, రషీద్,గుద్దటి కిష్టాలు, పుట్ట యాదయ్య, మారేపల్లి శ్రీను, బాధేపెల్లి రామకృష్ణ,తుంగ మల్లేష్, బసవని వెంకటయ్య, అన్యపు రామస్వామి, బసన్నమౌని చంద్రయ్య, రేవెల్లి దర్గయ్య, భరత్, పుట్ట శివ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావు నీ మర్యాద పూర్వకంగా కలిసిన కడ్తాల్ బి ఆర్ ఎస్ నాయకులు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** సరికొండ, ముద్విన్ గ్రామంలో పర్యటనబోయిన్ గుట్ట తండాలో సేవాలాల్, మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ ముద్విన్ లో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించబడ్డ ఇంటిని ప్రారంభించనున్న హరీష్ రావు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుని హైదారాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏప్రిల్ రెండో తారీఖున కడ్తాల్ మండలానికి రావాలని ఆహ్వానించారు. ఏప్రిల్ 2న సరికొండ గ్రామపంచాయతీ పరిధిలోని బోయిన్ గుట్ట తండాలో సేవాలాల్ మహారాజ్ మహాత్మా గాంధీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించాలని కోరారు. దానితోపాటు ముద్విన్ గ్రామపంచాయతీలో ఒక పేద కుటుంబానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్మించబడిన నూతన గృహాన్ని ప్రారంభించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన హరీష్ రావు ఏప్రిల్ 2న తప్పకుండా కడ్తాల్ మండలానికి వస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, మాజీ సర్పంచ్ నరసింహ, మాజీ ఉపసర్పంచ్ నరేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగయ్య, నరేష్, సాబీర్, అంజి, గోపాల్, వెంకటయ్య పాల్గొన్నారు.

# జాతీయ ఆహారభద్రత చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

## రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కడ్తాల్ మండల కేంద్రంలోని రేషన్ షాప్ నంబర్ 1597018 నీ ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది, ఈ తనిఖీల్లో భాగంగా రేషన్ షాపులో బియ్యం నిల్వల వివరాలను పరిశీలించి తనిఖీ చేయడం జరిగింది ఈ తనిఖీల్లో అంత్యదయ కార్డు లబ్ధిదారులకు చక్కెర ఇవ్వడం లేదని తెలిసింది. దీనిపై రేషన్ డీలర్కు నోటీస్ ఇచ్చి చక్కెర ఎందుకు ఇవ్వట్లేదని 30 రోజులలో కమిషన్కు నివేదిక పంపించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని ఆదేశించడం జరిగింది. అదేవిధంగా రేషన్ షాపుల్లో ఫిర్యాదు బాక్స్ వివరాలు మరియు సంబంధిత అధికారుల ఫోన్ నెంబర్ల వివరాలు కచ్చితంగా పెట్టాలని కమిషన్ బృందం ఆదేశించింది.

అనంతరం కడ్తాల్ లోని అంగన్వాడి కేంద్రం 2 మరియు నాలుగు కేంద్రాలను సందర్శించి బాలింతలు మరియు పిల్లలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు మరియు బాలింతలకు పెడుతున్న పౌష్టిక ఆహారం యొక్క నిల్వలను, మరియు రికార్డులను పరిశీలించి లబ్ధిదారులకు సరిగా అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి సెంటర్ లో పిల్లలకు అందుతున్న గుడ్డు సైజు పరిమాణం తక్కువగా ఉన్నందున దీనికి బాధ్యులైన గుడ్లు పంపిణీ చేసిన ఏజెన్సీకి మరియు సూపర్వైజర్ మరియు అంగన్వాడీ టీచర్ కు నోటీసులు ఇవ్వాలని డి డబ్ల్యూ ఓ ని కమిషన్ బృందం ఆదేశించడం జరిగింది .అనంతరం కడ్తాల్ లోని బాలికల స్కూల్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు పిల్లలకు పెడుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించడం జరిగింది. ఈ పరిశీలనలో మెనూ ప్రకారం ఆహారం అందించడం లేదని కమిషన్ దృష్టికి వచ్చింది. దీనికి బాధ్యులైన సంబంధిత అధికారులపై కమిషన్ చైర్మన్ మరియు సభ్యుల బృందం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత కడ్తాల్ లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ను తనిఖీ చేయగా విద్యార్థులను కమిషన్ బృందం ఫుడ్ ఎలా ఉంది మంచి పెడుతున్నారా అని తెలుసుకున్నారు. దానికి విద్యార్థులు కమిషన్ బృందానికి ధన్యవాదాలు చెబుతూ బాగానే పెడుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా కమిషన్ బృందం అభినందనలు తెలిపింది, ఈ పరిశీలనలో భాగంగా స్కూల్ ఆవరణలో విద్యార్థులకు నీటి వసతి లేదని రెండు నెలలుగా నీటి కొరత ఏర్పడిందని కమిషన్ బృందానికి అధికారులు మరియు విద్యార్థులు వివరించారు. అలాగే స్కూల్ ఆవరణలో ఫ్లోరింగ్ కోసం కూడా కమిషన్ బృందానికి విన్నవించారు. ఈ విషయంపై ఈ విషయంపై కమిషన్ చైర్మన్ మరియు బృందం పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పడం జరిగింది. అలాగే పరిశీలనలో భాగంగా హెల్త్ స్టేటస్ రిపోర్ట్స్ చేయట్లేదని పరిశీలనలోకి వచ్చింది. ఈ పరిశీలనలో విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిసింది. ఈ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధాన ఉపాధ్యాయులను ఆదేశించడం జరిగింది. అనంతరం జడ్పిహెచ్ఎస్ బాలుర , కడ్తాల్లో మరియు ప్రభుత్వఎస్టి బాలుర హాస్టల్ను కూడా పరిశీలించగా మెనూ ప్రకారం అసలు పెట్టట్లేదని కమిషన్ బృందం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది,విద్యార్థులకు పెడుతున్న ఆహార విషయంలో ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించడం జరిగింది. మెనూ ప్రకారం పక్కాగా అమలుపరచాలని అధికారులను హెచ్చరించడం జరిగింది. అనంతరం తలకొండపల్లిని పరిశీలించి వెటర్నరీ బెనిఫిట్ స్కీమ్ ఎం బి ఎస్ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీఎస్సీ పరిధిలోని బాలింతలు మరియు గర్భవతుల వివరాలు తెలుసుకున్నారు, ఆశ వర్కర్ల వసతుల గురించి మరియు ప్రైమరీ హెల్త్ సెంటర్ లో ఉన్న వసతి సౌకర్యం గురించి తెలుసుకున్నారు.

జిల్లాలోఆహారభద్ర చట్టం 2013 పై అవగాహన పెంచి అమలు పరచాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో,కమిషన్ సభ్యులు ఒరు గంటి ఆనంద్,గోవర్ధన్ రెడ్డి ,జ్యోతి,జిల్లా అధికారులు మరియు మండల అధికారులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

## ఉప్పల చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం పెద్దూరు తాండ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కేతావత్.జగ్రి అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు దేవుని పడకల్ మాజీ యంపిటిసి సభ్యుడు మూడవత్. రఘు నాయక్ ద్వారా రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ,జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ కి తెలియజేయడం జరిగింది. వెంటనే స్పందించిన మాజీ జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ తమ ట్రస్టు ద్వారా బాధిత కుటుంబానికి 3,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, మాజీ యంపిటిసి మూడావత్ రఘు నాయక్, మాజీ సర్పంచ్ మూడవత్ సక్రి, కిషన్ నాయక్ , మరియు ఉమ్మడి గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్ మూడవత్ శంకర్ నాయక్, మరియు మాజీ వార్డు సభ్యులు రవి, శ్రీను, వెంకటాపూర్ తాండ మాజీ ఉపసర్పంచ్ రాజు నాయిక్, గ్రామ పెద్దలు పోమ్యి నాయక్, దుంధ్యి నాయక్, రాములు నాయక్, భాష నాయక్ , బాలు నాయక్, చందర్ నాయక్, లాలు నాయక్ కొండా గారు తదితరులు వివిధ నాయకులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ముక్తాల శ్రావణి భర్త శేఖర్ గౌడ్ గర్భిణి రెండు రోజుల క్రితం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం కోసం చేరడం జరిగింది. నిన్న ఆమెకు వైద్యులు ఆపరేషన్ నిర్లక్ష్యం వల్ల ముక్తాల శ్రావణి మరణించడం జరిగింది. ఈ విషయం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి మృత్యురాలి కుటుంబం పట్ల సానుభూతి తెలుపుతూ 3000/- రూపాయలు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. అదేవిధంగా గ్రామానికి చెందిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి ముఖ్య అనుచరుడు కాకి కృష్ణ ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా కుటుంబానికి10,000/- రూపాయలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# బాదితునికి 2లక్షల ఎల్ ఓ సి అందజేత

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి):** కల్వకుర్తి మండల పరిధిలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన ఎండి గోరి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం గ్రామ మాజీ సర్పంచ్ రాకేష్ కుమార్ కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి ప్రభుత్వం ద్వారా రూ. 2లక్షల రూపాయల ఎల్ ఓ సి నీ హైదరాబాద్ లోనీ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నివాసంలో బాధితునికి అందజేశారు. ఈ కార్యక్రమం లో ,కాంగ్రెస్ పార్టీ పీసీసీ సభ్యులు మైసిగండి శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట నర్సింహా,గ్రామస్థులు భూపాల్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో బీసీలకు తీవ్ర అన్యాయం

## బిజేపి అధికార ప్రతినిధి రాజు నేత

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ మొత్తం3,04,965 కోట్లు అయితే అందులో బీసీలకు కేటాయించింది కేవలం 11,405 కోట్లు మాత్రమే మొత్తం బడ్జెట్లో చూసుకుంటే బీసీలకు ఇచ్చింది 3.6% మాత్రమే కేటాయించి తీవ్ర అన్యాయానికి గురిచేసింది అని ఓయూ జేఏసీ చైర్మన్, బిజెపి రాష్ట్ర నాయకులు రాజు నేత తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ప్రతి ఏడాది బడ్జెట్లో బీసీలకు 20 వేల కోట్ల రూపాయలను కేటాయించి ఐదేళ్లలో లక్ష కోట్లను బీసీల అభ్యున్నతి కోసం కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది కానీ నేడు ఆ హామీని తుంగలో తొక్కి బీసీలను మోసాలకు అన్యాయాలకు గురి చేస్తుందని రాజు నేత తెలిపారు. అలాగే బీసీ కార్పొరేషన్లు ఫెడరేషన్ లను కూడా గాలికి వదిలేశారని, బీసీలకు సబ్ ప్లాన్ పేరిట ప్రత్యేక నిధులు బడ్జెట్లో కేటాయిస్తామన్న హామీ కూడా మర్చిపోయారని తెలిపారు 56 శాతానికి పైగా ఉన్న బీసీలకు ఇచ్చిన నిధులు చాలా తక్కువ కావున వెంటనే ప్రభుత్వం పునసమీక్ష నిర్వహించి నిధులను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకు మనికంట మరియు బీసీ సంఘం నాయకులు బాలస్వామి, అయోధ్య, సురేష్, కర్ణాకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలు చల్లగా ఉండాలి

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఘనంగ స్వాగతం పలకడం జరిగింది. అలాగే వాలీబాల్ ఆడుతూ పోటీలను అనంతరం రాంపురం గ్రామ%శీ%లో మృతుతురాలి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసు శ్రీనివాస్ రెడ్డి,మరియు మండల ముఖ్య నాయకులు.పాల్గొన్నారు.

# ఖనిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మించాలి

## నిధులు తీసుకురావడంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ఆర్జీవన్ జిఎం చొరవ చూపాలి.

## మార్కపురి సూర్య

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సింగరేణి సంస్థ నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం కావడానికి సెంట్రల్ లైబ్రరీని నిర్మించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. బుధవారం నాడు స్థానిక పవర్ హౌస్ కాలనీలో ఉన్న జిల్లా గ్రంథాలయాన్ని ఏఐవైఎఫ్ నాయకులు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా అక్కడున్న నిరుద్యోగ యువతతో గ్రంథాలయ సమస్యలు తెలుసుకోవడం జరిగింది. అనంతరం మార్కపురి సూర్య మాట్లాడుతూ...రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వేలాదిమంది నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలకుసన్నద్ధమవుతున్న వారికి సరిపడే వసతులతో కూడిన లైబ్రరీ పారిశ్రామిక ప్రాంతంలో లేదని అవేదన వ్యక్తం చేశారు.కేవలం అరకొర వసతులతో సింగరేణి క్వార్టర్లో అద్దె ప్రాతిపదికన లైబ్రరీ నడుస్తుందని దీన్నిబట్టే ప్రభుత్వానికి ,సింగరేణి సంస్థకు నిరుద్యోగ యువత పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో కనబడుతుందని అన్నారు. సింగరేణి సంస్థ ప్రభుత్వం కలిసి పారిశ్రామిక ప్రాంతంలో సెంట్రల్ లైబ్రరీని అన్ని వసతులతో కూడిన భవంతిని నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అనేక సింగరేణి,ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయని వాటిలో లైబ్రరీ నిర్మాణానికి అనుగుణంగా ఉన్న స్థలంలో నిర్మించాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడో సివిల్స్ కు సెలెక్ట్ అయిన విద్యార్థులకు సింగరేణి నిధులనుండి తలా లక్ష రూపాయలు ఇస్తున్న సింగరేణి కి సింగరేణి కార్మికుల పిల్లల భవిష్యత్తు పట్టదా అని ప్రశ్నించారు. రామగుండం ఎమ్మెల్యే,ఆర్జీ.వన్ జీఎం చొరవ తీసుకొని వెంటనే సింగరేణి సిఎస్ఆర్ నిధులనుండి పారిశ్రామిక ప్రాంతానికి లైబ్రరీ కోసం నిధులు మంజూరు చేసి అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే విధంగా నూతన లైబ్రరీని వెంటనే నిర్మించాలని లేనిపక్షంలో నిరుద్యోగ యువతతో జిఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే గ్రంథాలయంలో చదువుతున్న నిరుద్యోగులతోమాట్లాడినప్పుడు అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని సరియైన స్టడీ మెటీరియల్ స్టడీ పాడ్స్ వంటి సౌకర్యాలు లేవని అలాగే లైబ్రరీ చుట్టూ కొంత చెట్లు ఉండడం వల్ల పరిశుభ్రంగా లేదని ఈ సమస్యలన్నింటినీ కూడా జిఎంకి దృష్టికి తీసుకుపోతామని సూర్య వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి సురేందర్, రాణవేణి సుధీర్ కుమార్, పోతరాజు నాగరాజు నాగరాజు, వినయ్, సాయి పాల్గొన్నారు

# ఎస్.ఎస్.సి విద్యార్థిని విద్యార్థులకు ప్యాడ్లు పెన్నులు పంపిణీ

### నిరుపేద విద్యార్థుల భవిష్యత్తు కోసం నా వంతు కృషి చేస్తా..

### కాంగ్రెస్ పార్టీ నాయకులు వసీమ్ అక్రమ్

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లోని 1వ డివిజన్ పరిధిలో గల విలేజ్ రామగుండంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలు సమీపించడంతో కాంగ్రెస్ నాయకులు వసీమ్ అక్రమ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడులు, పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొంతల రాజేష్ హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, పెన్నులు అందజేసిన వసీం అక్రమ్ ను ఈ సందర్భంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఉన్నత స్థాయి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించాడు. అదేవిధంగా ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వసీం అక్రమ్ మాట్లాడుతూ విలేజి రామగుండంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలు పూర్తి అయిన తర్వాత వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండకుండా విద్యార్థిని విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందజేయడంతో పాటు పదవ తరగతి పరీక్షల్లో మొదటి 5 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ వరకు వారి పై చదువుల కోసం తాను ప్రోత్సహిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పాఠశాలలో ఫేర్వెల్ డే సందర్భంగా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు, విద్యార్థిని విద్యార్థులకు భోజనం సదుపాయం కల్పించారు. ఇంకా ఈ కార్యక్రమంలో రామగుండం ఎం.ఈ.ఓ జి చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ మాజీ కార్పొరేటర్ బొమ్మక రాజేష్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, శ్రీనివాస్, తులసి, ఉమారాణి, లక్ష్మణ్, వాజిదా, స్వరూప్ చందు, అనిత, కవిత, సోపున్నీస తో పాటు కాంగ్రెస్ నాయకులు కే.ప్రేమ్, ఏ.సదానందం, ఎస్.సతీష్, బి.ప్రణయ్, సజ్జు, రవి, మున్న, సాయి, శ్రీకాంత్, సల్మాన్, సోను, ఉబెద్ తదితరులు పాల్గొన్నారు.

# బిల్లుల ఆమోదం పై ఖని లో కాంగ్రెస్ పార్టీ హర్షం

### అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ,బిసి రిజర్వేషన్ బిల్లులు ఆమోదించడంపై కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది.బుధవారం ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు గోదావరిఖనిలో కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు.అనంతరం కార్పోరేషన్ టీ జంక్షన్ లోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీనగర కాంగ్రెస్ అధ్యక్షులు బొంతల రాజేష్,నాయకులు మహంకాళి స్వామి,కొలిపాక సుజాత మాట్లాడుతూ 42% ఏకగ్రీవ తీర్మానం చేసి ఉభయ సభల్లో బిల్లును ఆమోదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు ఇతర మంత్రులు భట్టి విక్రమార్క,ఉత్తంకుమార్ రెడ్డి,శ్రీధర్ బాబు,దామోదర్ రాజనర్సింహ,పొన్నం ప్రభాకర్,సీతక్క,స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కు ధన్యవాదాలు తెలిపారు.ఎస్సీ వర్గీకరణ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం తెలుపడం చారిత్రాత్మకమన్నారు.30 ఏళ్లుగా వర్గీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి న్యాయం లభించిందని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 సెక్షన్ 9 ప్రకారం జాతీయ కమిషన్ సంప్రదించి సమాజంలో ఉన్న అసమానతలను తొలగించి అందరికీ సమానమైన అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు.బీసీ రిజర్వేషన్ బిల్లు 42% పెంచి ప్రజల గుండెల్లో చెరగరాని ముద్ర వేసి రిజర్వేషన్ ప్రక్రియను వేగవంతం చేసి దేశంలోనే ఎవరూ చేయలేని సాహసపతమైన నిర్ణయాన్ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్నారన్నారు.విద్య,ఉద్యోగాలలో,ప్రైవేటు రంగాలలో కూడా ఈ రిజర్వేషన్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు.పార్టీ గోదావరిఖని పట్టణ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ,దాని అనుబంధ సంఘాల నాయకులు కాల్వ లింగస్వామి,దిటీ బాలరాజు,ముస్తఫా,గట్ల రమేష్,బొమ్మక రాజేష్,కొప్పుల శంకర్,సుతారి లక్ష్మణ్ బాబు,సాంబమూర్తి ఉమా,చుక్కల శ్రీనివాస్,దంత శీను,కొమ్ము వేణు,కలవల సంజీవ్,తిరుపతి,ధూళికట్ట సతీష్,గుంపుల తిరుపతి,అనుమ సత్యనారాయణ,మారంగుల రమేష్,ఆడేపు రవి,గుమ్మడి రవి,ఆడెపు దశరథం,సింహాచలం, కనుకుంట్ల అశోక్,అల్లి శంకర్,దొంతుల కిరణ్, గుండేటి శంకర్,బాబు మియా,నకీమొద్దీన్,కన్నూరి శ్రీనివాసరెడ్డి,కౌటం సతీష్,చింతల రాజిరెడ్డి,లంబు సత్యనారాయణరెడ్డి,కీర్తి నాగరాజు,మోహిత్ సన్నీ,ఇంట్లో ఓదెలు,గాజుల కిరణ్,శోభ,శాంతి, సాయి,మాధవి, రజిత,లలిత,లీలావతి,కుంట సది,ఈదునూరి మల్లేష్,ఇదినూరి రవి ,పెగడపల్లి రమేష్,కొంద్ర కుమార్,గౌస్,దేవిడ్,సొల్లు రామస్వామి,వంశీ,శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హెూల్స్ ను వెంటనే సరి చేయాలి

### .... అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణ శ్రీ

**అగ్నిధార న్యూస్ (రామగుండం) :** ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హెూల్స్ ను వెంటనే సరి చేయాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణ శ్రీ అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణ శ్రీ రామగుండం నగర కార్పొరేషన్ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. నగరంలోని 11వ డివిజన్, 33వ డివిజన్ లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను అదనపు కలెక్టర్ పరిశీలించి ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హెూల్స్ ను వెంటనే సరి చేయాలని అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో నిర్మించిన రోడ్డుపై గల మ్యాన్ హెూల్స్ లోపలికి కుగిపోయి పిచ్చి మొక్కలు పెరగకుండా మ్యాన్ హెూల్స్ పై కప్పులను సరిచేయాలని అన్నారు. గోదావరిఖని లోని ప్రశాంత్ నగర్ లోని మల్కాపూర్ చెరువును అదనపు కలెక్టర్ పరిశీలించారు. చెరువుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మల్కాపూర్ చెరువు అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.అనంతరం అదనపు కలెక్టర్ రామగుండం పోలీస్ కమిషనర్ ను కలిసి ఆస్తి పన్ను వసూలు పై చర్చించారు.ఈ కార్యక్రమంలో రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఈఈ రామణ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో వీడ్కోలు ఉత్సవం..

### పదవ తరగతి విద్యార్థిని.. విద్యార్థులకు...

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం మార్చి 19:** సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో వీడ్కోలు ఉత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల కరస్పాండెంట్ శ్యాంసుందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ విద్యా సంవత్సరం ముగించుకున్న విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు చక్కగా రాసి, సింగరేణి హై స్కూల్ కు, కుటుంబాలకు మంచి ఫలితాలను అందజేయాలని ఆశించారు.అలాగే ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది,9 వ తరగతి 2026 బ్యాచ్..పదవ తరగతి,2025 బ్యాచ్ విద్యార్థిని,విద్యార్థులు మరియు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# యువతను విస్మరించిన తెలంగాణ ప్రభుత్వం....

### సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం...

తెలంగాణ ప్రభుత్వం బుధవారం నాడు ప్రవేశపెట్టిన బడ్జెట్లో యువతను విస్మరించిందని సిపిఐ పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025 26 కు సంబంధించి ఇందులో విద్యా వైద్యం కి సంబంధించిన బడ్జెట్లో నామినెల్ ప్రవేశపెట్టారనది సిపిఐ పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నామని, గతంలో విద్యా రంగానికి సంబంధించి 7.3 శాతం ఇస్తే ఈ బడ్జెట్ లో 7.5% మాత్రమే అంటే 0.2% మాత్రమే పెంచుతున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగిందనీ ,యువజన రంగానికి సంబంధించి కనీసం కమిషన్ వేయకుండా ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలను అమలు చేయకుండా 3000 రూపాయలు నిరుద్యోగులకి నిరుద్యోగ భృతి ఇస్తామన్న ప్రభుత్వం ఇవ్వడంలో పూర్తిగా వైఫల్యం చెందిందనీ, ప్రధానంగా ఈ తెలంగాణ రాష్ట్రంలో విద్య వైద్యం యువజన రంగాలకు సంబంధించిన నామినల్ బడ్జెట్ గా ప్రవేశపెట్టినదనీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా మేం భావిస్తామని తెలిపారు.

# ఎన్ సి డబ్ల్యూ ఏ ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సిలింగ్..

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం మార్చి 19. :** తేది:19, మార్చి 2025 రోజున,మందమర్రి ఏరియ సి.ఇ.ఆర్ క్లబ్ లో సింగరేణి ఎన్ సి డబ్ల్యూ ఏ ఉద్యోగులకు క్వాటర్స్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కౌన్సిలింగ్ కు మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియ లకు 93 క్వాటర్స్ ప్రకటించగా,54 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా,సీనియార్టీ ప్రకారం 21 మంది ఎన్.సి.డబ్ల్యూ.ఎ మందమర్రి మరియు శ్రీరాంపూర్ ఏరియ ఉద్యోగులకు పారదర్శకంగా క్వార్టర్స్ కేటాయించడం జరిగిందని,పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ్ ప్రసాద్,పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీ.జీ.ఎం ఐ.ఇ.డి రాజన్న,డి.వై.పి.ఎం మైత్రేయ బంధు, రాజలింగు (ఒ.ఎస్) పాల్గొన్నారు.'

# మంథని లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్

### - ఎన్.హెచ్ నిర్మాణంలో బుష్ క్లియరెన్స్ పనులు వేగవంతం చేయాలి

### - మంథని డివిజన్ కార్యాలయాల సముదాయ నిర్మాణానికి స్థలం గుర్తించాలి

### - ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి యాప్ లో నమోదు చేయాలి

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**అగ్నిధార న్యూస్ మంథని :** వరంగల్- మంచిర్యాల గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బుష్ క్లియరెన్స్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. మంథని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మాతా శిశు ఆరోగ్య కేంద్రం, అడవి సోమన పల్లి గ్రామంలో నిర్మాణం అవుతున్న ఇందిరమ్మ ఇండ్లు, ఉచ్చతర ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ...

జాతీయ రహదారి ప్యాకేజీ 1 లో భాగంగా మంత్రి మండలం పుట్టపాక వరకు ట్రెంచ్ కటింగ్ పనులు పూర్తి చేశామని, రోడ్డు అలైన్మెంట్ లోపల రోడ్డు వేసేందుకు వీలుగా పిచ్చి మొక్కలు తొలగించాలని, బుషెస్ క్లియరెన్స్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. మంథని డివిజన్ పరిధిలో కార్యాలయాల సముదాయం నిర్మించుకునేందుకు వీలుగా అనువైన స్థలాన్ని ఎంపిక చేసి ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో చేపట్టిన రేనోవేషన్ పనులను పరిశీలించిన కలెక్టర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. పెద్దపల్లి నుంచి మంథని ప్రాంతానికి గైనకాలజిస్ట్ ను కేటాయించడం జరిగిందని, మంథని మాతా శిశు ఆసుపత్రిలో ఈ నెల 22 నుంచి ఈ సేవలు మరింత విస్తృతంగా అందుబాటులో ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు.

అడవి సోమన్ పల్లి లో ఇండ్ల పరిశీలన : అడవి సోమన్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు పంపిణీ చేసిన లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు జి. మంజులతో ఇంటి నిర్మాణం పై కలెక్టర్ చర్చించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ యాప్ లో నమోదు చేస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అడవి సోమన్ పల్లి లోని ఉచ్చతర ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి విద్యార్థికి తెలుగు ,ఆంగ్లం చదవడం రాయడం, కనీస గణిత సామర్థ్యం ఉండేలా ఉపాధ్యాయులు పని చేయాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, ఇంచార్జి తహసిల్దార్ గిరి, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహ సంక్షేమ అధికారి ఉద్యోగానికి ఎంపిక. .!

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** మండల కేంద్రానికి చెందిన బోధన ప్రత్యూష యాదవ్ వసతి గృహ సంక్షేమాధికారి పోస్టుకు ఎంపికైనది. బోధన గట్టయ్య విజయలక్ష్మి లకు ముగ్గురు కుమార్తెలు. గట్టయ్య 2004లో మృతిచెందగా, విజయలక్ష్మి ఉపాధి హామీ కూలీ పనులు చేస్తూ ముగ్గురు ఆడపిల్లలను పోషించుచూ చదివించినది. చిన్న కుమార్తె బోధన ప్రత్యూష ఉస్మానియా యూనివర్సిటీలో 2022లో ఎమ్. ఏ ( సోషియాలజీ) లో అత్యంత ప్రతిభ కనబరిచి గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఆడపిల్లలకు చదువేందుకని ఇరుగు పొరుగు వారు వారించిన, కుటుంబ పరిస్థితులు అంతంతమాత్రమే ఉన్న మొక్కవోని దీక్ష తో సంక్షేమ అధికారి పరీక్ష లో కాళేశ్వరం జోన్ -1లో 74 వ ర్యాంకు సాధించారు. భవిష్యత్ లో ఎలాగైనా కష్టపడి టీజీపిఎస్ సి గ్రూప్ -1సాధించి పేద ప్రజల సంక్షేమాని కి పాటు పడ్తానని తెలియజేశారు.

# డాక్టరేట్ సాధించిన ఘటేష్ కు బిజెపి ఆధ్వర్యంలో ఘన సన్మానం

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని:** బిజెపి పెద్దపల్లి పార్లమెంట్ కో కన్వీనర్ గుండబోయిన లక్ష్మణ్ యాదవ్ ,బిజెపిసీనియర్ నాయకులు క్యాతం వెంకటరమణ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా, రామగుండం, జ్యోతినగ్ పట్టణానికి చెందిన సిలివేరి గట్టయ్య లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం అధిపతి , ప్రొఫెసర్ డా. వివేక్ వర్ధన్ పర్యవేక్షణలో హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ ఇన్ స్పెషల్ లైబ్రరీస్ ఇన్ తెలంగాణ. అనే అంశంపై విస్తృతమైన పరిశోధనలు పూర్తి చేసి సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన విశ్వవిద్యాలయం ఎగ్జామ్నేషన్ బ్రాంచ్ అధికారులు ఈయనకు లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం లో పి హెచ్ డి పట్టా ప్రధానం చేసిన సందర్భంగా ఈరోజు స్థానిక మెడిపల్లి సెంటర్ లో గటేష్ కి ఘనంగా శాలువాతో సన్మానించి మిఠాయి పంపిణీ చేయడం జరిగింది కార్యక్రమంలో మిట్టపల్లి సతీష్, తోట కుమారస్వామి, దెబ్బేట కమల్, సిలివేరి అంజి, పల్లికొండ నర్సింగ్, గొర్రె రాజు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ , బీసీ బిల్లులు అసెంబ్లీ చరిత్రలో ప్రతిష్టాత్మకం

### సీఎం, చిత్ర పటానికి పాలాభిషేకం కాంగ్రెస్ నాయకులు శివకుమార్

**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల్

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత , బీసీ లకు రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టడం తెలంగాణ అసెంబ్లీ లో ప్రతిష్టాత్మకమైన దని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శివకుమార్ అన్నారు బుధవారం సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ మందకృష్ణ మాదిగ చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ బిల్లును ప్రవేశపెట్టి , ఆమోదించడం హర్షనీయమని ఆనందం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకి ప్రాతినిథ్యం వహించిన మంత్రి దామోదర రాజనరసింహ కృషి ఫలితం దేశం లోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శనీయమని కొనియాడారు

# వికసిత్ భారత్ కు విశేష స్పందన

### ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ జై కిషన్ ఓజా

**అగ్నిధార న్యూస్,( రామగుండం)** వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 కు విశేష స్పందన లభించిందని వికసిత్ భారత్ యూత్ పార్లమెంటు కార్యక్రమం కోసం నియమించిన పెద్దపల్లి జిల్లా నోడల్ కాలేజీ గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ జై కిషన్ ఓజా తెలిపారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు.తాము చేపట్టినప్రచారం,అవగాహన కార్యక్రమాలకు వివిధ ప్రాంతాల నుండి అనేకమంది స్పందించి పేర్లు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు.యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాల నుంచి 173 మంది యువత ఒక నిముషం నిడివి కలిగిన వీడియో అప్లోడ్ చేసి పేరు నమోదు చేసుకున్నారని,స్క్రూటినీ కమిటీ సభ్యులు పరిశీలించి వడపోసి ఉత్తమ వీడియోలను అప్లోడ్ చేసిన 150 మందిని జిల్లా స్థాయి పోటీలో పాల్గొనడానికి ఎన్నిక చేసినట్లు పేర్కొన్నారు.ఇద్దరు ఇరవై అయిదు సంవ్సరాలు పై బడిన వారు,ముగ్గురు అసంబద్ధ విషయం పై మాట్లాడారని,6గురు పెద్దపల్లి నోడల్ జిల్లా పరిధిలో లేనివారని,4గురు ఎర్రర్ వీడియో అప్లోడ్ చేశారని,ఒక్కరు వీడియో అన్ అవైలబుల్,ఒకరు తప్పుడు అసంబద్ధ వీడియోను అప్లోడ్ చేశారని,ఇద్దరు ఇతర ప్రాంతాల నుండి వీడియో అప్లోడ్ చేశారని,23 మందిని తిరస్కరించినట్లు చెప్పారు.పెద్దపల్లినోడల్ జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 21న 75 మందికి,22న 75 మందికి వన్ నేషన్,వన్ ఎలక్షన్ పేవింగ్ థి వే ఫర్ వికసిత్ భారత్ అనే అంశం పై ప్రతి విద్యార్థి మాట్లాడతారని తెలిపారు.ఈ పోటీలలో పాల్గొనే వారికి రెండు రోజులపాటు భోజన వసతి కల్పిస్తామని,పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు కూడా ఇస్తున్నట్లు నోడల్ ఆఫీసర్ ఏ సాంబశివ రావు తెలిపారు.పోటీలో ఉన్నవారందరిని వివిధ అంశాలను పరిశీలించి ఐదుగురు న్యాయ నిర్ణేతలు మొత్తం100 మార్కులకు పాయింట్స్ ఇస్తారని,150 మందిలో నుండి 10 మందిని రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారని వెల్లడించారు.

# ఖని లోని 33వ డివిజన్లో సందర్శించిన ఇంచార్జి కమిషనర్

### 33వ డివిజన్ లో ప్రజలు ఎదురుకుంటున్న పలు సమస్యలు వివరించిన మద్దెల దినేష్

### డివిజన్లో బర్దర్లో ఏండ్ల తరబడి నిర్లక్ష్యంగా వదిలేసిన రోడ్డు పనులు ప్రారంభించిన నగర పాలక సంస్థ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన మద్దెల దినేష్

**అగ్ని ధార న్యూస్,( రామగుండం)** గోదావరఖని 33వ డివిజన్ ప్రజలు అనేక సమస్యలతో సతమతమైతున్న తరుణంలో ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్యలతోపాటు వీధి దీపాలు, నూతన రోడ్లు గూర్చి అనేక సందర్భాలలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఇంచార్జి కమిషనర్ ని 33వ డివిజన్ సందర్శించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని, కావున వారు స్పందించి బుధవారం రోజున ఉదయం 33వ డివిజన్ లో ఎక్సక్యూటివ్ ఇంజనీర్ రామన్, డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి , ఇతర శానిటేషన్ సూపర్ వైజర్ సుగుణకర్, వార్డ్ ఆఫీసర్ వినోద, ఆర్పీ రాజకుమారి తో పాటు అధికారులు సందర్శించి ప్రజల నుండి సమస్యలను అడిగి తేలుసుకున్నారు. అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజిలు ఎప్పుడు వేసినవి శిదిలావాస్థకు చెరుకొని పూర్తిగా చెడి పోయి అస్తవ్యస్థంగా మారిపోయి కుండీలు నిండి దురవాసన తో ప్రజలు రోగాల పడుతంన్నారని వివరించారు. ముఖ్యంగా రోడ్లు కూడా పూర్తిగా చెడిపోయాయని ఒక రోడ్డు అయితే 14-3-12 ఇంటి నంబర్ నుండి 14-3-121 నుండి పదేళ్లు నుండి రోడ్డు లేక ప్రజల తివ్ర ఇబ్బందులు పడుతున్నారు కావున వెంటనే రోడ్డు నూతన రోడ్డు వేయాలని అదునపు కలెక్టర్ మరియు అధికారులకు విరించడం జరిగిందని అన్నరు. అరుణ శ్రీ రామన్, మరియు శివానందు గార్లకు చెప్పిన వెంటనే నేటి నుండి రోడ్డు పనులు ప్రారంభించడం ప్రజల పక్షాన అధికారులు అధికారులకు దినేష్ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా విధి లైట్లు మరియు గల్లీలలో చిన్న చిన్న రోడ్లు వేయాలని అధికారులకు సూచించారు, డివిజన్ లో అన్ని సమస్యలను ఒక్కొక్కటిగా తీరుస్తామని హామీ ఇచ్చారు.

# ఘనంగా పోచమ్మ బోనాల పండగ



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి:** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఘనంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు.డప్పు చప్పుళ్ళు, పంబాల పూజారులు డోలు వాయిద్యాలతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. ఆలయానికి చేరుకుని బోనాలు నైవేధ్యంగా సమర్పించారు. ఈ గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

## బిజినెస్

### వైద్య బీమాలోకి ఎల్ఐసి




ప్రభుత్వ రంగంలోని దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) అతి త్వరలోనే వైద్య బీమా రంగంలోకి అడుగు పెట్టనుంది. ఇందుకోసం ఓ ఆరోగ్య బీమా సంస్థలో వాటా కొనుగోలుకు చర్చలు జరుపుతోంది. ఇదే విషయాన్ని ఎల్ఐసి ఛైర్మన్ సిద్ధార్థ మోహంతి మంగళవారం వెల్లడించారు. వైద్య బీమా కంపెనీలో వాటాల కొనుగోలు అంశంపై మార్చి 31 కల్లా పూర్తి స్పష్టతను ఇవ్వనున్నామని చెప్పారు. అయితే ఏ కంపెనీలో వాటా కొనుగోలు చేసే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. కాగా.. మెజారిటీ వాటా 51 శాతం లేదా అంతకంటే ఎక్కువ వాటాను మాత్రం కొనుగోలు చేయడం లేద న్నారు. దీంతో మైనార్టీ వాటాను కొనుగోలు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఎల్ఐసి విలువ, బోర్డు నిర్ణయాలు ఇతరత్రా అవకాశాల్ని పరిగణనలోకి తీసుకొని వైద్య బీమా సంస్థలో వాటా కొనుగోలు ఉంటుందన్నారు. ప్రస్తుతం జీవిత బీమా సంస్థలు పాలసీ తీసుకున్న వ్యక్తులు ఏదైనా కారణంతో ఆసుపత్రిలో చేరితే ఎటుంటి ఆరోగ్య బీమా కవరేజ్‌లను అందించడం లేదు. ఇటీవల మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో ఎల్ఐసి వాటాలను కొనుగోలు చేస్తోన్నట్లు రిపోర్టులు వచ్చాయి. బీమా రంగంలోకి ప్రవేశించడం ద్వారా తన ఉనికిని మరింత విస్తరించుకోవాలని ఎల్ఐసి లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తి స్పష్టత కోసం రెండు వారాలు ఆగాలి. మోహంతి ప్రకటనతో మంగళవారం బిఎస్ఇలో ఎల్ఐసి షేర్ విలువ 1.70 శాతం పెరిగి రూ.757.65 వద్ద ముగిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎల్ఐసి నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.11,056 కోట్లకు చేరాయి. ముఖ్యంగా ఉద్యోగుల వ్యయాలు తగ్గడంతో ప్రధానంగా నిర్వహణ వ్యయాలు తగ్గి సంస్థ మెరుగైన లాభాలకు దోహదం చేశాయి.

### ఆధార్‌తో ఓటరు కార్డు అనుసంధానం



త్వరలోనే ఓటర్ ఐడీతో ఆధార్‌ను అనుసంధించనున్నారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అత్యున్నతస్థాయి సమావేశం జరిగింది. ఓటర్ ఐడీ, ఆధార్ అనుసంధానంపై ఢిల్లీలో జరిగిన సమావేశంలో చర్చించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలో ఈసీలు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషీ, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి, యూఐడీఏఐ సీఈవో, ఎన్నికల కమిషన్ సాంకేతిక నిపుణులతో సమావేశం నిర్వహించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం.. భారతీయ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందని.. ఓటర్ల గుర్తింపు కార్డుని ఆధార్‌తో అనుసంధానించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950, 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా చేయాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఈ విషయంలో మరింత చర్చలు జరపాలని.. సాంకేతిక అంశాలపై త్వరలో ఖ×ణూ× అధికారులతో సంప్రదింపులు చేయనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న క్రమంలో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియ బలోపేతంపై సమావేశానికి అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించింది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిల్లో ఏవైనా పరిష్కారం కాని సమస్యలపై ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నట్లు ఈసీ తెలిపింది.

# ఎడ్యుకేషన్ లోన్ లేటుగా చెల్లిస్తే ఇంత పెద్ద ప్రయోజనం ఉందా..




ఒక ఎంబీఏ గ్రాడ్యుయేట్ రెడిట్ లో పంచుకున్న పోస్ట్ ఇప్పుడు వైరలవుతోంది. తన ఎడ్యుకేషన్ లోన్ ను చెల్లించడంలో అతడు తీసుకున్న కాల వ్యవధే ఇందుకు కారణం. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బెంగుళూరు పూర్వ విద్యార్థి అయిన తాను తన లోన్ విషయంలో చేసిన పనిని తెలివైనదిగా చెప్పుకుంటున్నాడు. మూడు నుంచి నాలుగేళ్ల పట్టే లోన్ ను తాను ఏకంగా ఎనిమిదేళ్ల పాటు చెల్లించినట్టు చెప్పాడు. ఇతగాడి ఆర్థిక విశ్లేషణ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఐఐఎం బెంగళూరు నుండి పట్టభద్రుడినయ్యాక కూర్చుని ఎంబీఏ తరహా ఆర్థిక విశ్లేషణ చేసాను. తీసుకున్న ఎడ్యుకేషన్ లోన్ ను తిరిగి చెల్లించడానికి తొందరపడటం ఎందుకని అనిపించింది. నేను తీసుకున్న నిర్ణయాల్లో ఇది అతిపెద్దది. చాలా మంది దీని ట్యాక్స్ ప్రయోజనాలను పట్టించుకోరు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80ఇ కింద, పన్ను చెల్లింపుదారులు ఎనిమిది సంవత్సరాల వరకు చెల్లించే వడ్డీపై 100% పన్ను మినహాయింపు పొందుతారు. అదే మీరు ఒక వేళ రెండు నుంచి మూడేళ్ల లోపు లోన్ తిరిగి చెల్లించేస్తే ఈ ముఖ్యమైన బెనిఫిట్ ను నష్టపోతారు. మనకున్న పూర్తి పీరియడ్ ను ఉపయోగించుకుని ట్యాక్స్ పేయబుల్ ఆదాయాన్ని మనమెందుకు ఆదా చేసుకోకూడదు? అంటూ అతడు ప్రశ్నించాడు. ఇక రెండో కారణం విషయానికొస్తే.. ఈ రెడిట్ యూజర్ రూ. 20 లక్షల రుణం తీసుకున్న రుణగ్రహీత కేసును ఉదాహరణగా చూపించాడు. 9 శాతం వడ్డీతో, రూ. 20 లక్షల అసలు మొత్తం అలాగే ఉండదు. మీరు తిరిగి చెల్లించడం ప్రారంభించే సమయానికి, పెరిగిన వడ్డీ కారణంగా అది రూ. 25-27 లక్షలకు పెరగవచ్చు అని తెలిపాడు. రుణం వడ్డీ విభాగంలో ఎక్కువ భాగాన్ని మొదటి కొన్ని సంవత్సరాలలో బ్యాంకు సేకరిస్తుందని వివరించాడు. ఎందుకంటే ఈఎంఐ వడ్డీ భాగం మొదటి కొన్ని సంవత్సరాలలో ఈ ఎంఐ ప్రధానంగా తిరిగి చెల్లించే భాగం కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. "నా డబ్బునంతా త్వరగా తిరిగి చెల్లించడానికి బదులుగా, నేను దానిని పొదుపులు పెట్టుబడులతో బ్యాలెన్స్ చేసుకున్నాను" అని అతడు తెలిపాడు.

# మస్క్‌తో అంబానీ బిగ్ డీల్!



ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన ఎలాన్ మస్క్‌కు చెందిన ఏరో స్పేస్ కంపెనీ స్పేస్ ఎక్స్‌తో.. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, భారత అపరకుబేరుడు ముకేశ్ అంబానీ డీల్ చేసుకున్నారు. రిలయన్స్ గ్రూప్ డిజిటల్ సంస్థ అయిన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్.. స్పేస్ ఎక్స్‌కు పూర్తి స్థాయి అనుబంధ సంస్థగా ఉన్నటువంటి స్టార్ లింక్ సర్వీసెస్‌తో జట్టుకట్టింది. ఇది శాటిలైట్ ఆధారిత టెలికాం సేవలను అందిస్తుండగా ఇప్పుడు భారత్‌లో జియో కోసం పనిచేయనుంది. అయితే.. మార్చి 11 న భారతీ ఎయిర్‌టెల్ కూడా ఇదే స్టార్ లింక్‌తో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరుసటి రోజే జియో అలాంటి డీల్‌ను కుదుర్చుకోవడం విశేషం. దేశీయంగా ప్రత్యర్థులుగా ఉన్న జియో, ఎయిర్‌టెల్‌కు ఇప్పుడు ఒకే సంస్థ.. భారత్‌లో శాటిలైట్ హైస్పీడ్ ఇంటర్నెట్ సర్వీసులను అందిస్తుందన్న మాట. భారత్‌లోనూ స్టార్ లింక్ సంస్థకు అనుమతులు లభించిన తర్వాత.. ఈ రెండు సంస్థలు అంటే జియో, ఎయిర్‌టెల్ శాటిలైట్ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవల్ని అందుబాటులోకి తీసుకురానున్నాయని చెప్పొచ్చు. ఈ మేరకు మార్చి 12న జియో.. ఈ ఒప్పందం గురించి వెల్లడించింది. తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఒప్పందం వివరాల్ని ప్రస్తావించింది. 'అందరికీ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందించేందుకు.. ఈ భాగస్వామ్యం ఒక కీలక అడుగు. జియో బ్రాడ్‌బ్యాండ్ సిస్టమ్‌తో స్టార్ లింక్‌ను లింక్ చేయడం ద్వారా మా పరిధి మరింత విస్తరించనున్నాం. ఈ డీల్ అనేది ఏఐ ఆధారిత యుగంలో కూడా హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ విశ్వసనీయతను మరింత పెంచడంలో దోహదపడుతుంది.' అని జియో వెల్లడించింది. జియో తన రిటైల్ అవుట్‌లెట్స్ సహా ఆన్‌లైన్ వేదికగా స్టార్ లింక్ సేవల్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించింది. పరస్పరం తమ ప్రయోజనాల్ని అందిపుచ్చుకొని రెండు కంపెనీలు ముందుకు సాగనున్నట్లు జియో.. తన ప్రకటనలో వెల్లడించింది. దీనికి ముందు రోజే.. ఎయిర్‌టెల్ స్టార్ లింక్ ఒప్పందం గురించి వివరించింది. స్టార్ లింక్‌తో ఒప్పందం ద్వారా.. దేశంలోని మారుమూల గ్రామాలకు కూడా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందించేందుకు కఅషి చేస్తామని స్పష్టం చేసింది.

# ఐపీఎల్ కోల్‌కతా టైటిల్ నిలబెట్టుకునేనా?

## స్పోర్ట్స్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సీజన్-18 మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్ (కెకెఆర్) డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. 2024 సీజన్‌లో ఏమాత్రం అంచనాల్లేకుండా బరిలోకి దిగిన కోల్‌కతా ముచ్చటగా మూడోసారి టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. టైటిల్‌ను చేజిక్కించు కొనే క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను క్వాలిఫయర్-1తో పాటు ఫైనల్‌లోనూ చిత్తు చేసి హ్యాట్రిక్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. కానీ ఈసారి కోల్‌కతాకు పెను సవాళ్లు ఎదురవుతున్నాయి. దశాబ్ది విరామం తర్వాత తమకు ట్రోఫీని అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను సైతం పక్కనబెట్టి అతడిని వేలానికి వదిలేసిన కెకెఆర్ యాజమాన్యం పెద్ద తప్పే చేసింది. ఈ క్రమంలోనే ఈ ఫార్మాట్‌లో గొప్ప రికార్డేమీ లేని అజింక్యా రహానేకు సారథ్య బాధ్యతలు అప్పగించింది. శ్రేయస్‌ను వదులుకున్న కెకెఆర్ యాజమాన్యం వేలంలో వెంకటేశ్ అయ్యర్‌ను ఏకంగా రూ. 23.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. ఈ క్రమంలో అతడికే సారథ్య పగ్గాలు అప్పజెప్పుతారని అంతా భావించినా.. టీమ్ మేనేజ్‌మెంట్ అనూహ్యంగా రహానేను కెప్టెన్‌గా, వెంకటేశ్ అయ్యర్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసింది. వీరు ఈసారి కెకెఆర్‌ను ఏ మేరకు ముందుకు తీసుకెళ్తారనేది ఊహాజనితం. రహానే గతేడాది జరిగిన సయ్యిద్ ముస్తాక్ అలీ టి20 టోర్నీలో 164.56 సగటుతో టాప్ స్కోరర్(469)గా నిలిచాడు. ఇక 2021 నుంచి కోల్‌కతాకు ఆడుతూ గత సీజన్‌లో 46 సగటుతో 370 పరుగులు చేసిన వెంకటేశ్ మిడిలార్డర్‌లో అత్యంత కీలకం. తనదైన రోజున అతడి విధ్వంసం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుంది. మిడిలార్డర్‌తో పాటు లోయరార్డర్‌లో దుర్భేధ్యమైన లైనప్ కెకెఆర్ సొంతం. సిక్సర్ల రింకూ సింగ్, హార్డ్ హిట్టర్లు ఆండ్రీ రస్సెల్, మన్‌దీప్ సింగ్ వంటి నాణ్యమైన ఫినిషర్లు కోల్‌కతాకు ఉన్నారు. ఇక భారత చాంపియన్స్ ట్రోఫీలో కీలకపాత్ర పోషించిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి నైట్‌రైడర్స్‌కు వెలకట్టలేని ఆస్తి. రెండో ఇన్నింగ్స్‌లో స్పిన్‌కు సహకరించే ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై అతడు అత్యంత ప్రమాదకారి. నరైన్‌కు అండగా వరుణ్ మ్యాజిక్ చేస్తే ప్రత్యర్థి జట్లకు వణుకు పుట్టడం ఖాయం.

### అప్పుడు విరాట్‌తో కలిసి.. ఇప్పుడు ఐపిఎల్ అంపైర్‌గా




2008లో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌ను భారత్ దక్కించుకుంది. ఈ టోర్నమెంట్‌లో టీం ఇండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ భారత్ జట్టుకు కెప్టెన్‌గా ఉండగా.. మరో స్టార్ ఆటగాడు రవీంద్ర జడేజా కూడా ఈ జట్టులో సభ్యుడే. అయితే ఈ టీంలో ఆడిన ఓ ఆటగాడు ఇప్పుడు ఐపిఎల్‌కు అంపైర్‌గా రానున్నాడు. 2008 అండర్-19 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచిన జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన తన్మయ్ శ్రీవాస్తవ ఇప్పుడు ఐపిఎల్‌కు అంపైర్‌గా రానున్నాడు. తన్మయ్ శ్రీవాస్తవ సొంత రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన క్రికెట్ అసోసియేషన్ ఈ విషయాన్ని వెల్లడించింది, 'నిజమైన ఆటగాడు ఎప్పుడు మైదానం విడిచిపెట్టడు. అతని పాత్ర మాత్రమే మారింది. ఈ కొత్త ప్రయాణంలో తన్మయ్‌కి ఆల్ ది బెస్ట్" అంటూ ఉత్తర్‌ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. అండర్-19 జట్టులో అద్భుత ప్రదర్శన చేసినా.. అతనికి పెద్దగా అవకాశాలు రాలేదు. 2008-12 వరకూ ఐపిఎల్‌లో ఆడిన అతను 7 మ్యాచుల్లో 8 పరుగులు మాత్రమే చేశాడు. డొమెస్టిక్ క్రికెట్‌లో 90 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, 44 లిస్ట్-ఎ, 34 టి-20లు ఆడి 7వేలకు పైగా పరుగులు చేశాడు. ఇందులో 17 సెంచరీలు, 81 హాఫ్ సెంచరీల ఉన్నాయి. ఐదేళ్ల క్రితం ప్రొఫెషనల్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ఇచ్చిన తన్మయ్.. దేశవాలీ క్రికెట్‌లో అంపైర్‌గా వ్యవహరిస్తున్నాడు.

# కీలక నిర్ణయంపై బీసీసీఐ యూటర్న్?



ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టు ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆడింది. తొలి టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించింది. దీంతో ఆ జట్టు 3 మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూడగా, ఒక మ్యాచ్ డ్రా అయింది. భారత జట్టు పేలవ ప్రదర్శన తర్వాత బీసీసీఐ కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే ఇప్పుడు ఇండియా టుడే ప్రకారం.. బీసీసీఐ తన నిర్ణయం నుండి వెనక్కి తగ్గవచ్చు. బీసీసీఐ అధికారి ఒకరు ఇండియా టుడేతో మాట్లాడుతూ.. ఆటగాళ్లు తమ కుటుంబాలను, సన్నిహిత వ్యక్తులను ఎక్కువ కాలం పర్యటనలో ఉంచాలనుకుంటే, భారత క్రికెట్ నియంత్రణ మండలి తన నిబంధనలను మార్చడాన్ని పరిగణించవచ్చని ఆయన తెలిపారు. అయితే అలా చేయడానికి ముందు ఆటగాళ్లకు బోర్డు అనుమతి అవసరం. ఆటగాళ్లు తమ కుటుంబాలు ఎక్కువ కాలం పర్యటనలో ఉండాలని కోరుకుంటే వారు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. బీసీసీఐ తన సొంత నిర్ణయం ప్రకారం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటన తర్వాత ఆటగాళ్లు వారి కుటుంబాలతో ప్రయాణించకుండా నిషేధిస్తూ బీసీసీఐ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత బోర్డు తీసుకున్న ఈ నిర్ణయంపై విరాట్ కోహ్లీ, కపిల్ దేవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవలే భారత జట్టు 2025 ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను గెలుచుకుంది. ఇప్పుడు భారత ఆటగాళ్ళు ఐపీఎల్‌లో బిజీగా ఉంటారు. మార్చి 22 నుంచి ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం కానుంది. దీని తర్వాత భారత జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటిస్తుంది. ఈ సమయంలో రెండు జట్ల మధ్య 5 టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడతారు. జూన్ 20 నుంచి టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుండగా, చివరి టెస్ట్ మ్యాచ్ జూలై 31 నుంచి ఆగస్టు 4 వరకు జరుగుతుంది.



## మరి ఇంత బోల్డ్‌గానా.. జినాల్ జోషి ఫోటోలు వైరల్



## పార్లమెంట్‌కి వెళుతున్న రామ్ చరణ్.. నమ్మలేకపోతున్నారా!

ఏంటి మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పార్లమెంట్‌కి వెళుతున్నారా, ఇది నిజమా అని మీలో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి కదా. రియల్ లైఫ్‌లో కాదు కాని రీల్ లైఫ్‌లో పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నాడట రామ్ చరణ్. త్వరలో సినిమా షూటింగ్ కోసం యూనిట్ సభ్యులు ఢిల్లీ వెళ్లనున్నట్టు తెలుస్తుంది. కథలో భాగంగా కొన్ని కీలక సన్నివేశాలను ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో చిత్రీకరించాల్సి ఉందట. అంతే కాకుండా జామా మసీదు పరిసర ప్రాంతాల్లోనూ సినిమా షూటింగ్ నిర్వహించేందుకు బుచ్చిబాబు ప్లాన్ చేయడంతో నిర్మాతలు పర్మీషన్స్ కూడా తీసుకున్నారని సమాచారం. త్వరలోనే చరణ్‌తో పాటు కీలక నటీనటులు, సాంకేతిక నిపుణుల బృందం ఢిల్లీ వెళ్లే అవకాశాలు ఉన్నాయి. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ మొన్నటి వరకు హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో, శివారు ప్రాంతంలో షూటింగ్ జరుపుకుంది. స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ వివిధ ఆటలు ఆడతాడని సమాచారం. సాధారణంగా స్పోర్ట్స్ డ్రామా అంటే ఒకే ఆట నేపథ్యంలో ఉంటుంది. కాని ఈ చిత్రంలో రామ్ చరణ్ పలు ఆటలు ఆడతాడట. ఆట కూలీ పాత్రలో రామ్ చరణ్ కనిపించబోతున్నారని వార్తలు వస్తుండగా, దీనిపై క్లారిటీ రావలసి ఉంది. ఇటీవలి కాలంలో ఎప్పుడూ చూడని వైవిధ్యభరిత కాన్సెప్ట్‌తో ఈ సినిమాని రూపొందించబోతున్నట్టు సమాచారం. ఇక ఈ సినిమా టీజర్‌ని రామ్ చరణ్ బర్త్‌డే సందర్భంగా విడుదల చేయాలని భావిస్తున్నారు. అదే సమయంలో సినిమా టైటిల్‌ను రివీల్ చేసే అవకాశం కూడా కనిపిస్తుంది. ఇదే ఏడాదిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే ఉద్దేశం ఉన్నట్లు తెలుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్‌తో కలిసి వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఆస్కార్ అవార్డ్ గ్రహీత ఏ ఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్న నేపథ్యంలో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుంది.



## ఆ దర్శకుడితో నాగార్జున 100వ సినిమా?

చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్.. ఈ నలుగురిని టాలీవుడ్‌కి నాలుగు స్తంభాలు అంటారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో అత్యధిక సినిమాలలో హీరోలుగా నటించింది వీరే. చిరంజీవి ఇప్పటికే 156 చిత్రాలకు పైగా నటించగా.. బాలకృష్ణ కూడా సెంచరీ పూర్తి చేశాడు. ఇక ఇప్పుడు నాగార్జున(%చీఖిస్త్రుఖితీయబఖు%) తన 100వ సినిమాను పూర్తి చేసే పనిలో ఉన్నాడు. ఇప్పటికే హీరోగా 99 చిత్రాల్లో నటించిన నాగ్.. తన సెంచరీ మూవీ కోసం ఆచి తూచి వ్యవహరిస్తున్నాడు. నాగ్ సోలో హీరోగా నటించిన చివరి చిత్రం 'నా సామి రంగ'. ఇది గతేడాది సంక్రాంతికి ఈ సినిమా రిలీజైంది. ఆ తర్వాత సోలో సినిమా ఇంత వరకూ ప్రకటించలేదు. ఇప్పుడు తన బెంచ్ మార్క్ సినిమా కోసం అదిరిపోయే ప్లాన్ వేస్తున్నట్లు టాక్ నడుస్తోంది. కింగ్ నాగ్ నటించబోయే 100వ సినిమాని టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మార్చేందుకు స్కెచ్ వేస్తున్నట్లు ఓ న్యూస్ చక్కర్లు కొడుతోంది ప్రస్తుతం నాగార్జున 'కుబేర', 'కూలీ' చిత్రాలతో బిజీగా ఉన్నాడు. ఇవి పూర్తయిన తర్వాత 100వ సినిమా ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉంది. తాజా వార్తల ప్రకారం, ఈ చిత్రానికి తమిళ దర్శకుడు కార్తీక్ దర్శకత్వం వహించనున్నారని సమాచారం. కార్తీక్ గతంలో తమిళంలో 'నితం ఓరువానం" చిత్రానికి దర్శకత్వం వహించారు.ఈ సినిమా తెలుగులో 'ఆకాశం' పేరుతో డబ్ అయ్యింది. ఇక్కడ ఆశించిన స్థాయిలో ఆ చిత్రం ఆడలేదు కానీ దర్శకుడు కథను తెరపై చూపించిన విధానం నాగ్‌కి బాగా నచ్చిందట. వెంటనే అతన్ని పిలిపించి..వందో చిత్రం బాధ్యతలు అప్పజెప్పాడట. తన 100వ విజువల్ వండర్‌గా, ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండాలని నాగ్ కోరుకుంటున్నట్లు గతంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. నిన్న మొన్నటి వరకు నాగార్జున వందో చిత్రానికి పూరి జగన్నాథ్, బెజవాడ ప్రసన్న కుమార్, తమిళ్ డైరెక్టర్ మోహన్ రాజా, నవీన్ పేర్లు గట్టిగా వినిపించాయి.. అయితే, తాజా సమాచారం ప్రకారం కార్తీక్‌తోనే ఈ ప్రాజెక్ట్ ఖరారైనట్లు కనిపిస్తోంది. షూటింగ్ ఈ ఏడాది చివరలో లేదా 2026 ప్రారంభంలో మొదలయ్యే అవకాశం ఉంది. నాగ్ అభిమానులకు ఆకట్టుకునేలా ఓ సూపర్ స్టోరీని రెడీ చేశాడట కార్తీక్. రూ. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా రేంజ్ లో నాగ్ సెంచరీ మూవీని తెరకెక్కించేందుకు రెడీ వుతున్నారట. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



## మోహన్ బాబు బర్త్ డే స్పెషల్.. మహదేవ శాస్త్రి గ్లింప్స్ చూశారా?

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కిస్తోన్న చిత్రం కన్నప్ప. ఈ మూవీని ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా భారీ బడ్జెట్‌తో అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రంలోని పలువురు అగ్రతారల ఫస్ట్ లుక్ పోస్టర్లను ఆడియన్స్‌కు పరిచయం చేశారు. ఈ మూవీలో మోహన్ బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, ప్రభాస్, బ్రహ్మానందం, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రంలో మోహన్ బాబు మహదేవ శాస్త్రి పాత్రలో అభిమానులను అలరించనున్నారు. ఇవాళ ఆయన పుట్టిన రోజు కావడంతో ప్రత్యేక గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. మహదేవ శాస్త్రి పాత్రను పరిచయం చేసే సాంగ్‌ను గ్లింప్స్ రూపంలో రిలీజ్ చేశారు. ఈ పాటను ఓకేసారి ఐదు భాషల్లో ప్రేక్షకుల

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com